



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States





సంపుటి : 23 | సంచిక : 162 | ది.29-8-2024 | విజయవాడ | గురువారం | పేజీలు : 8 | వెల : రూ.1/-

## రివర్స్ టెండరింగ్, ఎస్ఈబీ రద్దు

● ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు



**అమరావతి,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన రివర్స్ టెండరింగ్ విధానాన్ని మంత్రివర్గం రద్దు చేసింది. పాత విధానంలోనే టెండర్లు పిలిచే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అబ్కారీ శాఖ పునర్ వ్యవస్థీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ క్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) రద్దుకు ఆమోదం తెలిపింది. పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ ఫొటో తొలగింపు, సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అంగీకారం తెలిపింది. పోలవరం ఎడమ కాలువ పనుల పునరుద్ధరణకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఈ పనుల్లో ప్రస్తుత గుత్తేదారు సంస్థనే కొనసాగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వివాదాల్లోని భూముల రిజిస్ట్రేషన్ నిలిపివేతకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది.

**ఏపీ ఈ-కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు..** ఏపీ కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన రివర్స్ టెండరింగ్ విధానం రద్దుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మళ్లీ పాతవిధానంలోనే టెండర్లను పిలిచేందుకు ఆమోదించింది. అలాగే కొత్త మద్యంపాలసీ విధానానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్ బ్యూరోను రద్దు చేసింది. రైతులకు ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలపై జగన్ ఫొటోను తొలగించేందుకు, సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే పోలవరం ఎడమ కాలువ పనుల పునరుద్ధరణకు ఓకే చెప్పింది. ప్రస్తుతం వివాదాల్లో ఉన్న భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

## ఏపీ అభివృద్ధికి ఊతమిచ్చేలా కేంద్రం నిర్ణయాలు: చంద్రబాబు



**అమరావతి,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** పోలవరం ప్రాజెక్టు, పరిశ్రమలకు సంబంధించి రెండు నోట్స్‌ను కేంద్రం క్లియర్ చేసింది. కేంద్రం చర్యలతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న నమ్మకం కలుగుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "పోలవరం ప్రాజెక్టుకు రూ.12,127 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించింది. పోలవరాన్ని 2027 మార్చిలోగా పూర్తి చేసేందుకు షెడ్యూల్ ఏర్పాటు చేశారు. పోలవరం విషయంలో ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అభినందనలు. పోలవరానికి కేంద్రం పెండింగ్ నిధులు ఇవ్వాలి. కేంద్రం ఇవ్వలేదని ఎప్పుడూ పోలవరం పనులు ఆపలేదు.

**కొత్త డయాఫ్రమ్ వాల్‌నిర్మిస్తాం..** 2019లో పోలవరం ప్రాజెక్టుకు శనిగ్రహం ఆవరించింది. రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం పనులకు గ్రహణం పట్టింది. 2021 నాటికి పోలవరం పూర్తి చేసి ఉండాలి. వైకాపా హయాంలో కేంద్రం రూ.8వేల కోట్లు ఇచ్చింది, పీపీపీ లేఖ కూడా రాసింది. ఐదేళ్లుగా పురుషోత్తమపట్నం, పట్టిసీమను ఉపయోగించుకోలేదు. ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి మళ్లీ పోలవరాన్ని ట్రాక్‌లో పెట్టగలిగాం. ప్రాజెక్టు పూర్తవుతుందనే నమ్మకం కలిగింది. చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్న కేంద్రానికి ధన్యావాదాలు. పోలవరం చాలా సున్నితమైన ప్రాజెక్టు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. గోదాట్లో మునిగిన పోలవరం ఇప్పుడు మళ్లీ గట్టెక్కింది. ఇప్పుడు కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మించడమే మేలని నిపుణులు తేల్చారు. రూ.992 కోట్లతో కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తాం. 41.15 మీటర్ల ఎత్తుతో మొదటి దశ ప్రాజెక్టు 2027 నాటికి పూర్తి చేయాలన్నదే మా లక్ష్యం.

**ఏపీలో మూడు కారిడార్‌లు..** దేశంలో మొత్తం 12 పారిశ్రామిక కారిడార్‌లు నిర్మిస్తుంటే ఏపీలో మూడు కారిడార్‌లు ఉన్నాయి. వీటిపై మొత్తం రూ.28వేల కోట్ల వ్యయం చేయాలని నిర్ణయించారు. కడప జిల్లా కొప్పర్తి, కర్నూలు జిల్లా ఓర్వకల్లులో పారిశ్రామిక హబ్‌లు వస్తున్నాయి. కృష్ణపట్నానికి కూడా అనుమతిచ్చారు. నక్కపల్లికి ఫార్మా క్లస్టర్ కూడా వస్తోంది. ఇవన్నీ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి కారణమవుతాయి. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రానికి మంచి రోజు" అని చంద్రబాబు అన్నారు.

## ఈ వారంలోనే జర్నలిస్ట్ లకు ఇళ్ల స్థలాలు

● మరో సారి కుండబద్దలు కొట్టిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** జర్నలిస్టులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నట్లు సీఎం రేవంత్ రెడ్డి మరోమారు కుండ బద్దలు కొట్టారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టుల పరస్పర సహకార సంఘానికి ఈ వారంలోనే పేట్ బషీరాబాద్ సైట్ స్వాధీనం చేస్తామని ప్రకటించారు. ఈ నెల 28న జరగాల్సిన కార్యక్రమం సంబంధిత సమాచార, రెవెన్యూశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందుబాటులో లేకపోవడం వల్ల వాయిదా పడిన సంగతి తెలిసిందే. చిట్‌చాట్‌లో కొందరు విలేకరులు అడిగిన ప్రశ్నలకు సీఎం రేవంత్ రెడ్డి పలు సమాధానాలు ఇచ్చారు. గత ప్రభుత్వంలోని సీఎం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, వాటిలోని ఒక్కో అంశాన్ని తాము సరిదిద్దుతూ వస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే జర్నలిస్టులకు జరిగిన అన్యాయాన్నికూడా సవరిస్తున్నామని చెప్పారు. ఈ వారంలోనే జేఎన్జే సొసైటీకి పేట్ బషీరాబాద్ సైట్ స్వాధీనం చేస్తూ తన చేతుల మీదుగా మెమో ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఎమ్మెల్సీ పోతుల సునీత రాజీనామా



**చీరాల,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** వైసిపి ఎమ్మెల్సీ పోతుల సునీత వైసీపీకి రాజీనామా చేశారు. గతంలో ఆమె టీడీపీలో పని చేశారు. 2014 ఎన్నికల్లో చీరాల నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఇండిపెంటెండెంట్ అభ్యర్థి ఆమంచి కృష్ణ మోహన్ పై ఓడిపోయారు. అయితే ఆ సమయంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో పోతుల సునీతకు పార్టీ అధినేత చంద్రబాబు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవం ఇచ్చారు. అయితే 2019 ఎన్నికల్లో చీరాల నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున కరణం బలరాం పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఆ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారం కోల్పోయింది. దీంతో ఎమ్మెల్యే కరణం బలరాంతో పాటు ఎమ్మెల్సీ పోతుల సునీత కూడా టీడీపీకి రాజీనామా చేశారు. అనంతరం వైసీపీలో చేరారు. అప్పటి సీఎం జగన్ మోహన్ రెడ్డి సైతం పోతుల సునీతకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘోర ఓటమిపాలవడంతో పార్టీ కార్యక్రమాలకు పోతుల సునీత క్రమేపీ దూరంగా ఉంటూవచ్చారు. తాజాగా ఆ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డికి ఆమె పంపారు.

## శాశ్వత న్యాయమూర్తులుగా ఇద్దరు జడ్జీల ప్రమాణం

● ఇద్దరు శాశ్వత న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం

● జడ్జిలతో ప్రమాణ స్వీకారం చేయించిన సీజే ధీరజ్ సింగ్ ఠాకూర్



**అమరావతి,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వేణుతురుమల్లి గోపాల కృష్ణా రావు ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ప్రాంగణంలోని ఫస్ట్ కోర్టు హాల్ లో బుధవారం ఉదయం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఇరువురితో దైవసాక్షిగా ప్రమాణం చేయించారు. ప్రస్తుతం రాష్ట్ర హైకోర్టు లో అదనపు న్యాయమూర్తులుగా పనిచేస్తున్న ఇరువురిని సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులను భారత రాష్ట్రపతి ఆమోదించిన పిదప వీరిని శాశ్వత న్యాయమూర్తులుగా నియమిస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు, న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయవాదులు, హై కోర్ట్ సిబ్బంది ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు.

## ప్రధాన మంత్రి నరేంద్ర మోడి సిఎస్ లతో వీడియో సమావేశం



**అమరావతి,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** తాగునీరు,జల్ జీవన్ మిషన్,పారిశుధ్యం, జాతీయ రహదార్లు,గ్యాస్ పైపులైన్ల నిర్మాణం,రైల్వే ప్రాజెక్టులు,అమృత్-2.0 వంటి ప్రగతి అంశాలపై బుధవారం ఢిల్లీ నుండి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడి వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా ప్రధాని మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పథకం కింద ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించేందుకు నిర్దేశించిన పథకాలు, ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు.అదే విధంగా పారిశుద్ధ్య నిర్వహణ ప్రాజెక్టలను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు.పలు రైల్వే,రోడ్డు ప్రాజెక్టులు,నూతన పైపులైను నిర్మాణ ప్రజెక్టులను కూడా సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రధాని మోడి సిఎస్ లను ఆదేశించారు.అటల్ మిషన్ ఫర్ రెజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్సఫర్మేషన్ 2.0(అమృత్ 2.0)కింద పట్టణాల్లోని ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటి సౌకర్యాన్ని కల్పించడం,సీవరేజ్ ట్రీట్మెంట్ ప్రాజెక్టులు,తాగునీటి వనరుల చుట్టూ పార్కుల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఆదేశించారు. ఈసమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్,రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్,టిఆర్అండ్బి ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే,ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్,స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండి గంధం చంద్రుడు,మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్న కవిత... ఘనస్వాగతం పలికిన బీఆర్ఎస్



**హైదరాబాద్,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బెయిల్ పై విడుదలైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ సాయంత్రం ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వచ్చిన ఆమెకు బీఆర్ఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. కవిత వెంట ఆమె భర్త అనిల్, సోదరుడు కేటీఆర్, హరీశ్ రావు, జోగినపల్లి సంతోష్ కుమార్, ఇతర కుటుంబ సభ్యులు, పార్టీ నేతలు ఉన్నారు. కవిత ఎంతో ఉత్సాహంగా ఎయిర్ పోర్టు నుంచి వెలుపలికి వచ్చారు. దాదాపు ఐదున్నర నెలల తర్వాత కవిత హైదరాబాద్ లో అడుగుపెట్టడంతో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం ఉప్పొంగుతోంది. కాగా, కవిత హైదరాబాద్ నుంచి కేసీఆర్ ఫాంహౌస్ కు వెళతారని తెలుస్తోంది.

## ఏపీ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది...

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

● కొప్పర్తి, ఓర్వకల్లులో ఇండస్ట్రియల్ హబ్ లు ● కేంద్రం ప్రకటన ● ఏపీకి పరిశ్రమలు వచ్చేందుకు కేంద్రం సాయం చేస్తోందన్న కేంద్రమంత్రి రామ్మోహన్



**అమరావతి,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** ఏపీ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రానికి వివిధ రకాల పరిశ్రమలు వచ్చేందుకు కేంద్రం సాయం చేస్తోందని తెలిపారు. ఇవాళ కేంద్రం ఏపీకి రెండు ఇండస్ట్రియల్ హబ్ లను ప్రకటించిన నేపథ్యంలో, రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడారు. ఓర్వకల్లు, కొప్పర్తికి ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు మంజూరయ్యాయని వెల్లడించారు. రాయలసీమ వంటి వెనుకబడిన ప్రాంతంలో ఉద్యోగాల కల్పన అనేది చాలా ముఖ్యమైన విషయం అని తెలిపారు. అందుకే రాష్ట్ర సహకారంతో కేంద్రం ఇక్కడ పారిశ్రామిక హబ్ ఏర్పాటుకు శ్రీకారం చుడుతోందని పేర్కొన్నారు. కొప్పర్తి... విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ లో భాగంగా వస్తుందని రామ్మోహన్ నాయుడు వివరించారు. ఓర్వకల్లు, కొప్పర్తిలో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కొప్పర్తిలో పునరుత్పాదక శక్తి, ఇంజినీరింగ్, కెమికల్, మెటాలిక్, నాన్ మెటాలిక్, టెక్స్ టైల్స్, ఆటోమొబైల్ కంపెనీలు వస్తాయని అన్నారు. ఇక్కడ రూ,8,800 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశముందని తెలిపారు. రాయలసీమ అటు బెంగళూరుకు, ఇటు చెన్నైకి దగ్గరగా ఉంటుందని, హైదరాబాద్ కు సమీపంగా ఉంటుందని వివరించారు. గతంలో అక్కడ పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని రామ్మోహన్ నాయుడు అభిప్రాయపడ్డారు. కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండు ప్రాంతాలను ఎంపిక చేసుకున్నాయని, దీనిపై కేబినెట్ లో కూడా ఆమోదం లభించిందని వెల్లడించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు ఉంటే ఎలాంటి అభివృద్ధి జరుగుతుంది అనేదానికి ఇదొక నిదర్శమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ప్రజలు మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ల నాయకత్వాన్ని బలపరిచి, ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించారని తెలిపారు. గత ఐదేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిన నేపథ్యంలో, రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో పయనించాలంటే ఈ ముగ్గురి నాయకత్వం అవసరమని ప్రజలు భావించారని, కూటమి గెలుపునకు ఇదే కారణమని వివరించారు.

## రాష్ట్రంలో ఉత్పత్తయిన పత్తినంతా కొనుగోలు చేయాలని కేంద్రానికి లేఖ

● మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎస్.సవిత వెల్లడి ● పత్తిలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల తొలగింపుతోనే అధిక ధర ● ప్లాస్టిక్ వినియోగం తగ్గించేలా రైతుల్లో అవగాహన కల్పించండి : మంత్రి సవిత ఆదేశం ● రాష్ట్ర రైతుల దగ్గర పంట కొనుగోలు చేస్తే సెస్ మినహాయింపుపై నిర్ణయం : ● జన్నింగ్, స్పిన్నింగ్ మిల్లర్లకు స్పష్టంచేసిన మంత్రి అచ్చెన్న ● పత్తి రైతుకు అండగా ఉంటామన్న అచ్చెన్నాయుడు



**అమరావతి,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో పత్తి సాగు, ఉత్పత్తి పెరగడంతో పాటు రైతులకు ఆర్థిక భరోసా కలిగేలా నూతన వంగడాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎస్.సవిత తెలిపారు. రాష్ట్రంలో రైతుల దగ్గర పత్తి కొనుగోలు చేస్తేనే సెస్ తొలగిస్తామని పత్తి స్పిన్నింగ్, జిన్నింగ్ వ్యాపారులకు మంత్రులు స్పష్టంచేశారు. పత్తి రైతుల దగ్గర మొత్తం పంట కొనుగోలు చేసేలా సీసీఎల్ కు, కేంద్రానికి లేఖరాయనున్నట్లు వెల్లడించారు. బుధవారం సచివాలయంలో పత్తిలో వ్యర్థాల తొలగింపు, రైతులకు అధిక ధర లభ్యంపై జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లరు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయం విద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులతో మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత సమావేశమయ్యారు. పత్తిలో వ్యర్థాల వల్ల ధర తగ్గుముఖంపై రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి కె.సునీత పవర్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, రాష్ట్రంలో 2017-18లో 20.50 లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తి జరగ్గా, 2023-24లో 11.58 లక్షల బేళ్ల ఉత్పత్తికి తగ్గిపోయిందన్నారు. ప్లాస్టిక్, గోనె సంచుల్లో పత్తిని ప్యాకింగ్ చేయడం వల్ల జిన్నింగ్ సమయంలో వ్యర్థాలు బయటపడుతున్నాయన్నారు. దీనివల్ల పత్తి నాణ్యత దెబ్బతినడంతో పాటు ధర కూడా తగ్గుతోందని, దీనివల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. పత్తి సేకరణ సమయంలో కాటన్ సంచులు వాడకం వల్ల ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పడే అవకాశం ఉండదన్నారు. ఇందుకు వ్యవసాయశాఖాధికారులు రైతుల్లో అవగాహన కల్పించాలని మంత్రి సవిత సూచించారు.

**వంద శాతం ఈ క్రాప్ తో పత్తి రైతులకు మేలు : మంత్రి అచ్చెన్నాయుడు**

ఈ క్రాప్ లో తప్పనిసరిగా పత్తి రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ క్రాప్ లో నమోదు చేసిన పంటనంతా సీసీఐ కొనుగోలు చేయాలన ఆ సంస్థ ప్రతినిధికి స్పష్టంచేశారు. అదే సమయంలో ఈ క్రాప్ లో నమోదు వల్ల ప్రభుత్వం అందించే ఫలాలతో లబ్ధిపొందొచ్చునని రైతులకు అవగాహన కల్పించాలన్నారు.అంతిమంగా రైతులకు మేలు చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి వెల్లడించారు. పత్తి దిగుడులు పెంపుదల, వ్యర్థాల నివారణపై మహారాష్ట్ర, తెలంగాణలో పరిస్థితులు అధ్యయనం చేసి తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. పత్తి సేకరణలో ప్లాస్టిక్ వినియోగంపై నివారణకు జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లర్లు ముందుకు రావాలన్నారు. ప్లాస్టిక్ సంచుల్లో వచ్చే పత్తిని కొనుగోలు చేయబోమని రైతులకు తేల్చి చెప్పాలన్నారు. ప్రభుత్వం కూడా ప్లాస్టిక్ వినియోగంపై ఉక్కుపాదం మోపుతుందన్నారు. అంతిమంగా రైతులకు మేలు చేసేలా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. జ్యూట్ సంచులు, కాటన్ సంచులు వినియోగంలోకి తీసుకురావాలని, రైతులను చైతన్యం చేసేందుకు అధికారులు, జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యాలు, సీసీఐ ప్రతినిధులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పత్తి రైతుల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. పత్తి సాగులో అధిక ఉత్పత్తికి మేలైన వంగడాలు రూపొందించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయం విద్యాలయం శాస్త్రవేత్తలకు మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఆప్కో ఎండీ పావన మూర్తి, వ్యవసాయాశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

**వార్తాప్రభ - పంచాంగం**

**29-8-2024 గురువారం**

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం.
ఆషాఢమాసం, శుక్లపక్షం

తిథి : ఏకాదాశి 1.38 వరకు
నక్షత్రం : ఆరుద్ర 4.39 వరకు
వర్జ్యం : 6.02 నుండి 7.59 వరకు
దుర్ముహూర్తం : 06.02 నుండి 7.36 వరకు
రాహుకాలం : 1.51 నుండి 3.24 వరకు
మంచి సమయం : లేదు
సూర్యోదయం : 5.50కి
సూర్యాస్తమయం : 6.18కి

# రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ పనికి మాలిన ప్రచారమంటూ కే టి ఆర్ మండిపాటు.



**హైదరాబాద్ఆగష్టు 28 (వార్తాప్రభ) :** బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటైనందునే ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చిందంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రచారం పై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు పనిమాలిన స్టేట్ మెంట్లు చేస్తూ రాజకీయ ప్రయోజనం పొందాలని కుటిల ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. 'ఎమ్మెల్సీ కవిత కు బెయిల్ రావటానికి బీజేపీతో కుమ్మక్కు అయితే మరి నేషనల్ హెరాల్డ్ కేసులో 2015 డిసెంబర్ లో ఈ డి కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇద్దరికీ బెయిల్ వచ్చింది. కాంగ్రెస్ కూడా ఎన్డీయే తో కుమ్మక్కు అయితేనే బెయిల్ వచ్చిందా' అని కేటీఆర్ ప్రశ్నించారు. ఇండియా కూటమిలో భాగమైన ఏఏపీ నేత మనీష్ సిసోడియా కు కూడా వారం రోజుల క్రితమే బెయిల్ వచ్చిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. అంతేకాదు ఓటుకు నోటు కుంభకోణంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి 2015 నుంచి బెయిల్‌పై ఉన్నారన్న సంగతి కాంగ్రెస్ నేతలు గుర్తు పెట్టాలకోవాలన్నారు. ఇవన్నీ కూడా ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే జరిగాయి. కనుక వీరంతా ఎన్డీయే భాగస్వాములేనని అనుకోవాలా అని కాంగ్రెస్ నేతలకు కౌంటర్ ఇచ్చారు.

# జిల్లా పవర్ లిఫ్టింగ్ టీం ఎంపిక



**అమలాపురం,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** సెప్టెంబర్ 14,15 తేదీల్లో అమలాపురంలో జరగబోయే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనే డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పవర్ లిఫ్టింగ్ టీం ను ఎంపిక చేశారు. హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ లో సెలక్షన్స్ కమిటీ చైర్మన్,మెంబర్స్ గా మట్టపర్తి సముద్రం,డిఆర్ కే నాగేశ్వరరావు,జి.గణేష్ బాబు, కత్తుల శ్రీనివాసరావు,పి. రత్నకుమారి, సిహెచ్. రాజబాబులు వ్యవహరించి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్,మాస్టర్స్ ( మెన్ అండ్ ఉమెన్ ) విభాగాల్లో జిల్లా నలుమూలల నుండి వచ్చిన 70మంది క్రీడాకారులలో మెరిట్ చూపించిన 30 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం జరిగిన అభినందన కార్యక్రమంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎనుముల పద్మరాజు ఈ క్రీడా పోటీలు మంచి భవిష్యత్తుని ఇస్తాయని శుభాకాంక్షలు తెలిపారు. సెక్రెటరీ వంటేద్దు వెంకన్న నాయుడు మాట్లాడుతూ క్రీడాకారుల్లో క్రీడ నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఈ విధమైన పోటీలను నిర్వహిస్తున్నామని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సెలక్షన్స్ కి పీఈటి వి బుజ్జి,జాతీయ స్థాయి పవర్ లిఫ్టర్లు ఎం.వీరేంద్ర, పి వందన,బి.అప్పన్న, బి.యశ్వంత్, జిమ్ కోచ్ లు సహకరించారని కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు.

# సెరెనా కిచెన్ అండ్ కేఫ్ ను ప్రారంభించిన యువ నాయకుడు పంతం సందీప్



**కాకినాడ రూరల్,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** కాకినాడ రూరల్ సిద్ధార్థ నగర్ గ్రంధి కళ్యాణ మండపం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన సెరెనా చికెన్ అండ్ కేఫ్ ను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు, యువ నాయకుడు పంతం సందీప్ బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా సందీప్ మాట్లాడుతూ కాకినాడ నగర భోజన ప్రియులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో సెరెనా కిచెన్ అండ్ కేఫ్ అందుబాటులో ఉంటుందని, పార్టీలకు, కుటుంబ సభ్యులతో కలిసి మంచి భోజనం చేయడానికి సెరెనా కిచెన్ అందుబాటులో ఉంటుందన్నారు. అలాగే ఇంతటి అహ్లాదకరమైన వాతావరణంలో సెరెనా కిచెన్ ఏర్పాటు చేసిన యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపార అభివృద్ధి జరగాలని ఇలాంటి కేఫ్ లు మరికొన్ని నెలకొల్పి అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ మేనేజింగ్ డైరెక్టర్లు బొజ్జా సురేష్ కుమార్, శివ ప్రసాదులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్లు బొజ్జా సురేష్ శివప్రసాద్ లు మాట్లాడుతూ కాకినాడ పరిసర ప్రాంతాల వాసులకు కాకినాడ వచ్చే భోజన ప్రియులకు శుచితో కూడిన రుచికరమైన మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో భోజనాన్ని అందిస్తామని ఈ అవకాశాన్ని కాకినాడ ప్రజలు సద్వినియోగం చేసుకుని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్,స్వరూప్ శ్రేయోభిలాషులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత విద్యార్థులకు ఎంపీ పరామర్శ..



**కాకినాడ,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** ప్రత్తిపాడు నియోజకవర్గం, ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో ఉన్న డా. బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయ్యి 86 మంది విద్యార్థులు అస్వస్థకు గురై స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ పరామర్శించారు. ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ బుధవారం ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. అనంతరం ఆసుపత్రి వైద్యులతో సమావేశమై విద్యార్థులు పూర్తిగా కోలుకునేవరకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ప్రభుత్వ అధికారులు మరియు స్థానిక కూటమి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ది. అమలాపురం డిగ్రీ కాలేజీ విదార్థుల ప్రభంజనం.



**అమలాపురం,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** ఆదికవి నన్నయ్య యూనివర్సిటి విడుదల చేసిన 4 వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో ది. అమలాపురం డిగ్రీ కాలేజ్ విద్యార్థిని, విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ది. అమలాపురం డిగ్రి కాలేజి లో బి.ఎస్సి చదువుతున్న కడలి కావ్య 9.9 జి.పి.ఎ తో యూనివర్సిటీ టాపర్ నిలిచింది, 9.8 గ్రేడ్ పాయింట్లు తో 25 మంది 9.7 గ్రేడ్ పాయింట్ల తో 20 మంది. అలాగే 9 గ్రేడ్ పాయింట్ల తో సుమారు 60 మంది పైగా విద్యార్థులు వివిధ గ్రూపులలో ప్రతిభను కనభరిచారు, వీరిని కళాశాల డైరెక్టర్లు కిరణ్ కుమార్ రాంబాబు, నాయుడు, సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ సూరిబాబు, మరియు అధ్యాపక బృందం అత్యుత్తమ గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించి అభినందించారు

# మొల్లమాంబ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కరపత్రం విడుదల



**నందిగామ,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు సెప్టెంబర్ 4వ తేదీన జరుగు రామాయణ రచయిత్రి మొల్లమాంబ కాంస్య విగ్రహావిష్కరణకు నియోజకవర్గ శాలివాహన కుమ్మరి సంఘం సభ్యులంతా హాజరుకావాలని సంఘ జిల్లా అధ్యక్షులు బొమ్మన శ్రీనివాసరావు కోరారు. బుధవారం నాడు స్థానిక రామాలయం నందు జరిగిన నియోజకవర్గ శాలివాహన కుమ్మరి సంఘ సభ్యుల సమావేశంలో విగ్రహ ఆవిష్కరణ కరపత్రాన్ని శ్రీనివాసరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సెప్టెంబర్ నెల 4వ తేదీన జరుగు మొల్లమాంబ విగ్రహ ఆవిష్కరణకు మైసూరు మహారాజు, భారతీయ జనతా పార్టీ పార్లమెంటు సభ్యులు ఎదు వీర కృష్ణదత్త చామరాజ వడియార్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారని తెలిపారు. ఈ సమావేశంలో శాలివాహన కుమ్మరి సంఘ సభ్యులు భర్తవరపు దుర్గాప్రసాద్,పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కాసర్ల లక్ష్మీనారాయణ,భాజపా నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య, శ్రీనివాసరావు,సాంబయ్య, వెంకటేశ్వరరావు,సురేష్,శ్రీను, అంజి తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానానికి రూ.10 వేలు విరాళంగా ఇచ్చిన లంక లితీష్



**మైలవరం,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** మైలవరం పట్టణంలోని వడ్డెర కాలనీలో అంకాలమ్మ గుడి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం సందర్భంగా జరిగిన అన్నదాన కార్యక్రమానికి మైలవరం నియోజవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ రూ.10 వేలు విరాళంగా అందజేశారు. స్థానిక తెదేపా నాయకులతో కలిసి బుధవారం గుడి కమిటీ సభ్యులను కలిసి నగదు అందజేశారు. ఈ సందర్భంగా గుడి కమిటీ సభ్యులు లితీష్ కి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

# నగర పోలీస్ కమిషనర్ ను కలిసిన బార్ అసోసియేషన్ గవర్నింగ్ బాడీ సభ్యులు



**విజయవాడ, ఆగష్టు 28 (వార్తాప్రభ) :** ది బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి మరియు అరిగల శివరామ ప్రసాద్ (రాజా) మరియు గవర్నింగ్ బాడీ సభ్యులు గండూరి వెంకట రామశర్మ, నిడుమోలు సుబ్రమణ్యం, తలతోటి క్రాంతి కుమార్, చవల రవికుమార్ మరియు సిద్దాబత్తిని రాజ్యలక్ష్మి అందరూ కలిసి విజయవాడ సిటీ పోలీస్ కమిషనర్ ఎస్ వి రాజశేఖరా బాబు ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది. ఫ్రెండ్లీ పోలీసింగ్ గురించి, ప్రస్తుతం కోర్టు పని గంటల్లో ఎదురవుతున్న ట్రాఫిక్ గురించి చర్చించడం జరిగింది. న్యాయవాదులకి సమస్యలు ఏమైనా వస్తే తన దృష్టికి తీసుకు వస్తే తక్షణమే స్పందించి పరిష్కారం చూపుతా అని వర్ తెలియజేశారు.

# నేడు పిఆర్ కళాశాలకు న్యాక్ బృందం



**కాకినాడ,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** కాకినాడ పిఆర్ ప్రభుత్వ కళాశాలలో న్యాక్ బృందం గురువారం పర్యటన చేస్తున్నట్లు అసిస్టెంట్ ప్రిన్సిపల్స్ డా. బి చక్రవర్తి తెలిపారు. నేషనల్ అసిస్మెంట్ అక్రిడిటేషన్ (న్యాక్) కౌన్సిల్ బృందం గురు, శుక్రవారాల్లో కాకినాడ పిఆర్ ప్రభుత్వ గవర్నమెంట్ కళాశాలను పరిశీలనకు రావడం జరుగుతుందని అసిస్టెంట్ ప్రిన్సిపల్స్ డా. బి.చక్రవర్తి తెలిపారు. బుధవారం కాకినాడ పీఆర్ కాలేజీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బృందానికి చైర్మన్ గా డా. బిజేంద్ర కుమార్ పుంజ్య, దేవశి, కె.మహ్మద్ మదీనా ముగ్గురు సభ్యులున్న బృందం రావడం జరుగుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ తిరుపణ్యం ఇతర అధ్యాపక బృందం స్వాగతం పలుకుతారని తెలిపారు. ముగ్గురు సభ్యులున్న బృందం బుధ,గురువారాల్లో కళాశాలలో పర్యటించనున్నారు. తొలిరోజు కళాశాల జరుగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు పరిశీలించడం జరుగుతుందన్నారు. న్యాక్ పర్యటనకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు..

● కలిసికట్టుగా తెలుగుభాషను కాపాడుకుందాం - డాక్టర్ జోస్యుల కృష్ణబాబు




**కాకినాడ,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** ఆదిత్య డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ, పీ.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా.బి.ఇ.వి.ఎల్. నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జ్యోతి ప్రజ్వలన మరియు ప్రార్థన గీతంతో ప్రారంభమైన ఈ వేడుకలకు అధ్యక్షత వహించిన అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ వాడుక భాషలోనే పుస్తకాలు ఉండాలని వ్యవహారిక భాష కోసం ఉద్యమం చేసిన మహనీయుడు శ్రీ గిడుగు వెంకట రామమూర్తి అని అన్నారు. తెలుగు భాష వారోత్సవాలు నిర్వహించిన తెలుగు శాఖాధిపతి తేజేశ్వరరావును అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాకినాడ జిల్లా సాహితీ ప్రవంతి అధ్యక్షులు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు మాట్లాడుతూ కలసికట్టుగా తెలుగు భాషను కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా పర్వతాల పేటలో జన్మించిన గిడుగు పిడుగేనని తెలిపారు. కరడుగట్టిన గ్రాంథికవాదులకు ఎదురెళ్లి చేసిన వ్యవహారిక భాషా ఉద్యమాన్ని,ఆ ఉద్యమంలో ఎదుర్కొన్న సమస్యలను,చివరికి విజయం సాధించిన తీరును వివరించారు. తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ,విద్యార్థులు పాటించవలసిన నియమాలు తెలిపారు. తెలుగు సాహిత్య మాధుర్యాన్ని పద్య సొగసులను వివరించారు. అనంతరం తెలుగు భాషా వారోత్సవాలలో నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన తెలుగు శాఖ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డా.ఎన్.శేషారెడ్డి,డిగ్రీ కళాశాలల సెక్రటరీ డా.ఎన్.సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సి. సత్యనారాయణ,ఇన్చార్జి ఎన్. మూర్తి,తెలుగు శాఖధిపతి టి. తేజేశ్వరరావు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజకీయాలు ఎన్నికల వరకు మాత్రమే

● భాజపా జిల్లా అధికార ప్రతినిధి కేదార్నాథ్ శర్మ



**నందిగామ,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** బిజెపికి రాజకీయాలు ఎలక్షన్ల వరకు మాత్రమే తరువాత అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగుతుందని బిజెపి ఎన్టీఆర్ జిల్లా అధికారి ప్రతినిధి కేదార్నాథ్ శర్మ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం కోరిన మొదటి విడత పోలవరం ప్రాజెక్టు కు 12,500 కోట్లు, ఓర్వకల్లు దగ్గర ఇండస్ట్రీ పార్క్ 2500 కోట్ల నిధులు ఆంధ్రప్రదేశ్ యువతకు, రైతులకు ఎంతో మేలు కలిగిస్తాయని ఆయన తెలిపారు. దీని ద్వారా ఆర్థిక సంపద పెరిగి ఉద్యోగ కల్పన ఏర్పడి అటు రైతులకు ఇటు యువత వేరే రాష్ట్రాలకు పోకుండా తమ ప్రాంతాలలోనే నివసిస్తూ కుటుంబాలతో హాయిగా జీవనం సాగిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీకి, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లకు రైతుల తరపున యువత తరపున ప్రకటనలో ధన్యవాదములు తెలిపారు.

# ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం తూట్లు

● వైసీపీ నగర అధ్యక్షులు మల్లాది విష్ణు



**విజయవాడ సెంట్రల్,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యభద్రతకు తూట్లు పొడుస్తోందని విజయవాడ వైసీపీ నగర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆరోపించారు. అన్ని ప్రాంతాలలో విషజ్వరాలు విజృంభిస్తున్నా.. ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదని మండిపడ్డారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో మురుగు కాలవలన్నీ దోమలకు ఆవాసాలుగా మారాయని.. ఫలితంగా నగర ప్రజలు దోమకాటు వ్యాధులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తాగునీటి వ్యవస్థనూ పట్టించుకోకపోవడంతో మంచినీరు కలుషితమై ప్రజలు డయేరియా బారిన పడుతున్నారన్నారు. జనం పిట్టల్లా రాలిపోతున్నా.. వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ శాఖల అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని నిప్పులు చెరిగారు. ఈ ప్రభుత్వానికి కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడంపై ఉన్న శ్రద్ధ.. ప్రజారోగ్యంపై లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ చేతగానితనం వల్ల నగర ప్రజలను వింత జ్వరాలు వేధిస్తున్నాయని.. ఒక్క సెంట్రల్ లోనే అజిత్ సింగ్ నగర్, పాయకాపురం, గుణదల ప్రాంతాలలో అతిసారం బారిన పడి అనేక మంది ఆస్పత్రుల పాలయ్యారని వెల్లడించారు.

**వైఎస్ జగన్ హయాంలో..** వైఎస్ జగన్ హయాంలో రాష్ట్రంలోని ప్రతి ఒక్క పౌరుడి ఆరోగ్య అవసరాలు తీర్చడమే లక్ష్యంగా అప్పటి వైసీపీ ప్రభుత్వం పనిచేసిందని మల్లాది విష్ణు చెప్పారు. దేశమంతా కోవిడ్ మహమ్మారితో ఇబ్బందులు పడుతుంటే... ఏపీ ప్రజలను వైఎస్ జగన్మోహన్ రెడ్డి కంటికి రెప్పలా కాపాడుకున్నారన్నారు. ప్రజల ఆరోగ్యానికి పూర్తిస్థాయి భరోసాని కల్పిస్తూ.. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష, 108, 104 సర్వీసుల పెంపు, ఆరోగ్య ఆసరా వంటి కార్యక్రమాల ద్వారా నాణ్యమైన వైద్యాన్ని అందించినట్లు చెప్పారు. వైఎస్సార్ మానసపుత్రిక అయిన ఆరోగ్యశ్రీ పథకాన్ని జగనన్న హయాంలో మరింత పటిష్టపరిచి ప్రొసీజర్లను 3,257 కి పెంచడం జరిగిందన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 25 లక్షలకు పెంచడం చారిత్రాత్మకమన్నారు. ఒక్క సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు ఐదేళ్ల కాలంలో అక్షరాల రూ. 170 కోట్ల విలువైన వైద్య సేవలు ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి ఉచితంగా అందించినట్లు చెప్పారు. అలాగే 4 నూతన అర్బన్ హెల్త్ సెంటర్లను ఈ ప్రాంతంలో ప్రారంభించుకున్నట్లు తెలిపారు. వీటిలో 60 రకాల టెస్టులతో పాటు 172 రకాల మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ప్రతి ఇంటిని జల్లెడపడుతూ చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నియోజకవర్గంలో 52,519 మంది సద్వినియోగపరచుకున్నట్లు తెలిపారు. కానీ చంద్రబాబు ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పూర్తిగా గాలికొదిలేసిందని మల్లాది విష్ణు ఆరోపించారు. స్పెషలిస్టు వైద్యులు సహా సిబ్బంది నియామకాలు నిలిపివేసి.. పేదల జేబులకు కూటమి సర్కారు చిల్లులు పెడుతోందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ప్రజల ఆరోగ్యం పట్ల పూర్తి బాధ్యత తీసుకోవాల్సిందిగా సూచించారు. వ్యాధులు ప్రబలుతున్న ప్రాంతాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అన్ని రకాల సీజనల్ మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చి.. ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

# 25 కోట్లతో 15 కిలో మీటర్ల రోడ్డు

● గ్రామాలకే అందం తెచ్చిన రహదారి నిర్మాణం





**హనుమాన్ జంక్షన్,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** గత ప్రభుత్వ హయాంలో రహదారుల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు, పల్లెర్లమూడి గ్రామానికి చెందిన సోషల్ వర్కర్ అట్లూరి రమేష్ 2022 లో కేంద్రమంత్రి నితిన్ గట్కరి ని కలసి గన్నవరం నియోజకవర్గం, నూజివీడు నియోజక వర్గాలను కలిపే పల్లెర్లమూడి రహదారి నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని కోరటంతో 2022 డిసెంబర్ లో గన్నవరం నియోజకవర్గం వేలేరు నుండి సీతారాం పురం పల్లెర్లమూడి కొయ్యూరు, బొమ్ములూరు వరకు 15 కిలో మీటర్లు రహదారి అభివృద్ధికి 25 కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. నిధులు మంజూరైన రహదారి నిర్మాణం జరగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి పార్థసారథి ఈ పనుల్ని వేగవంతం చేయటంతో రెండు నెలల కాలంలో 95 శాతం పనులు పూర్తి అయ్యాయి. మంత్రి పార్థసారథి , గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ చేతుల మీదుగా త్వరలో ప్రారంభోత్సవం చేయనున్నారు. బాపులపాడు మండలం వేలేరు నుండి ప్రారంభమయ్యే ఈ రహదారి పల్లెర్లమూడి లో ఒక కిలోమీటరు , సీతారాం పురం లో 200 మీటర్లు , వెలేరులో 600 మీటర్లు కొయ్యూరు 205 మీటర్లు సిమెంట్ రోడ్డు నిర్మాణం తో పాటు రెటైనింగ్ వాల్ తో పాటు మిగిలిన రోడ్ తారు రోడ్డు తో అభివృద్ధి చేస్తున్నట్లు అట్లూరి రమేష్ తెలిపారు. బుదవారం నిర్మాణంలో ఉన్న తారు రోడ్డు ను అయా గ్రామాలకు చెందిన మూల్పూరి దన కోటేశ్వరరావు, సర్పంచ్ కొల్లి వీర వెంకట సత్యనారాయణ , సాంబశివరావు , కొల్లి లక్ష్మీ నారాయణ , గోగినేని బ్రమ్మాజి , మారుతి కనస్ట్రశన్ కనస్ట్రక్షన్ అధినేత దేవభక్తుల నాగేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా పల్లెర్లమూడి గ్రామంలో అట్లూరి రమేష్ తన స్వంత నిధులతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయటంపట్ల పలువురు అట్లూరి రమేష్ ను అభినందిస్తున్నారు. అలాగే 15 కిలో మీటర్లు రోడ్డు ను కేంద్రం తో మంజూరు చేయించి కుగ్రామాలగుండా రోడ్డు ను నిర్మించటం పట్ల ఆయా గ్రామాల ప్రజలు రమేష్ ను అభినందిస్తున్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉంటా మున్సిపల్ నూతన కమిషనర్ రమణబాబు



**నందిగామ,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** మున్సిపల్ కమిషనర్ గ బుధవారం ఇవి రమణ బాబు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ నూతన కమిషనర్ ఇవి రమణ బాబు మాట్లాడుతూ పట్టణంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని పట్టణ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు ప్రజల సహకారం కావాలని ఆయన కోరారు. క్లీన్ నందిగామ గ్రీన్ నందిగామ ధ్యేయంగా పని చేస్తానని కమిషనర్ తెలిపారు. పట్టణంలో సమస్యలపై దృష్టి పెడతానని ముఖ్యంగా పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి పెడతానని అదే విధంగా త్రాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటానని కమిషనర్ తెలిపారు.

# దాహం కేకలతో లింగాలపాడు గ్రామ ఎస్సీ,ఎస్టీ కాలనీలు

● తాగునీటి, పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని సిపిఎం పార్టీ డిమాండ్



**నందిగామ,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** మండల పరిధిలోని లింగాలపాడు గ్రామంలో ఎస్ సి,ఎస్ టి కాలనీలలో నెల రోజుల నుండి మంచి నీరు సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే మంచినీటి సమస్య పరిష్కారం చేయాలని మండల సిపిఎం పార్టీ ప్రధాన కార్యదర్శి కే గోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారికి గ్రామ త్రాగునీటి, పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ మంచినీరు లేక ఉప్పునీరు తాగి ప్రజలు ఫ్లోరైడ్ బారిన పడుతున్నారని తెలిపారు. తక్షణమే మంచినీరు సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లింగాలపాడు గ్రామంలో పారిశుద్ధ్యం బాగా లేదని,ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారని, గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని,గేదెలు రోడ్ల మీద కట్టేయడం వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. తక్షణమే ఎస్ సి,ఎస్ టి కాలనీ లలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని, మంచినీరు సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. డ్రెయినేజీ సిస్టమ్ మెరుగుపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కరి వెంకటేశ్వర రావు,గోపినాయక్, లాజర్,వేల్పుల.ఏసోబు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి కుట్రలతో కవితక్క అరెస్టు

**–టీఆర్ఎస్ కార్యాలయంలో ఏం.ఎల్. సి.కవితకు అభినందనలు తెలిపిన రవీందర్ యాదవ్.**



**శేరిలింగంపల్లి,ఆగస్టు 28 (వార్తాప్రభ):** భారాస ఎమ్మెల్సీ కవిత ఢిల్లి లిక్కర్ కేసులో బెయిల్ పొందిన తర్వాత హైదరాబాద్‌కు రావడంపై ఆ పార్టీ సీనియర్ నేత రవీందర్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు.గత రెండు రోజులుగా ఢిల్లి లోనే ఉన్న రవీందర్ ఎమ్మెల్సీ కవితను హస్తినాలోని భారాస పార్టీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ పార్టీ కుట్రలతో ఎమ్మెల్సీ కవితను అన్యాయంగా అరెస్ట్ చేసిందన్నారు. న్యాయం గెలిచిందన్నారు.సుప్రీం కోర్టు ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని తెలిపారు.రాజకీయ కుట్రలతో బీజేపీ పార్టీ,కాంగ్రెస్ పార్టీ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయన్నారు.కావాలని బురద జల్లే ప్రయత్నాలను రెండు పార్టీలు చేస్తున్నాయని ఆరోపించారు.కర్నాటకలోని స్కామ్ పై తెలంగాణ బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.ఆ స్కామ్‌లో తెలంగాణలోని కాంగ్రెస్ నేతలు ఉన్నట్లుగా ఆధారాలు ఉన్నా.. ఎలాంటి విచారణను ఎందుకు కోరడం లేదని నిలదీశారు.ఇక్కడే ఎవరు,ఎవరితో కుమ్మక్కైనారో స్పష్టంగా తెలుస్తుందని చెప్పారు.కాంగ్రెస్ నేతలను కాపాడుతుంది ఎవరో ప్రజలకు తెలుసన్నారు.ఐదు నెలలు అయినా ఎందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ స్కామ్ మీద నోరు మెదపలేదని ప్రశ్నించారు. కేవలం ఎమ్మెల్సీ కవితపై అక్కసుతో ఏది పడితే అది మాట్లాడుతున్నారన్నారు. న్యాయ వ్యవస్థపై ఉన్న నమ్మకంతో భారాస పోరాడిందని వెల్లడించారు. ఆలస్యమైనా చివరకు న్యాయం గెలిచిందని స్పష్టం చేశారు.రానున్న రోజుల్లో భారాస పార్టీ,బీజేపీ,కాంగ్రెస్ పార్టీల కుమ్మక్కు రాజకీయాలపై పోరాటం చేయనుందని రవీందర్ యాదవ్ వెల్లడించారు. ఎమ్మెల్సీ కవిత,వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు ఢిల్లి నుంచి హైదరాబాద్ ఒకే ఫ్లైట్ లో కలిసి వచ్చారు. ఎయిర్ పోర్టులో ఎమ్మెల్సీ కవితకు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.

## మేయర్ శాంతి కోటేష్ గౌడ్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించిన శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



**జవహర్ నగర్,ఆగస్టు,28:(వార్తా ప్రభ)** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12 డివిజన్ శ్రీరామ్ నగర్ కాలనీలో శ్రీ నల్లపోచమ్మ అమ్మ వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం పూజా కార్యక్రమంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శాంతి కోటేష్ గౌడ్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిధులు స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మరియు టిపిసిసి ఉపాధ్యక్షులు వజ్రేష్ యాదవ్, స్థానిక కార్పొరేటర్లు, జవహర్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు, ఎస్సై వేణుమాధవ్, మరియు స్థానిక మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది మరియు జవహర్ నగర్ కాలనీల అధ్యక్షులు,స్థానిక నాయకులు,భక్తులు, ప్రజలు, కార్యకర్తలు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ దత్తాత్రి సేవలు చిరస్మరణీయం

**–టీయూడబ్ల్యూజే అధ్యక్షులు విరాహత్ అలీ**

**హైదరాబాద్, ఆగస్టు 28 (వార్తాప్రభ)** దాదాపు మూడు దశాబ్దాలు ఈనాడు పత్రికలో జర్నలిస్టుగా పనిచేసి, నిజాయితీకి మారుపేరుగా నిలిచి, మీడియా రంగానికి దత్తాత్రి అందించిన సేవలు చిరస్మరణీయమని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీ కొనియాడారు. బుధవారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన దత్తాత్రి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరై నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజాయితీకి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచి, తోటి జర్నలిస్టులకు దత్తాత్రి స్ఫూర్తిగా నిలిచారని విరాహత్ తెలిపారు. దత్తాత్రి కుటుంబానికి మీడియా అకాడమీ ద్వారా సహకారం అందించేందుకు తమ సంఘం చర్యలు చేపడుతుందని ఆయన అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం రాష్ట్ర నాయకుడు బాలకృష్ణ, దత్తాత్రి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# వైద్య విద్యార్థినికి ఫీజు నిమిత్తం ఎమ్మెల్యే గాంధీ ఆర్థిక సహాయం



**శేరిలింగంపల్లి,ఆగస్టు 28 (వార్తాప్రభ):** హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట కి చెందిన తిమ్మయ్య కుమార్తె బత్తిని గాయత్రి కి కాకతీయ మెడికల్ కాలేజ్ లో ఎంబీబీఎస్ లో సీట్ వచ్చిన సందర్భంగా కాకతీయ సేవ సమితి కూకట్ పల్లి వారి ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరంకు గాను కళాశాల ఫీజు 29, 000 /– రూపాయలను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ చెక్కు రూపేణా చెల్లించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టినది,తల్లిదండ్రులు ఊర్లో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు,ప్రభుత్వ మెడికల్ కళశాల లో ఎంబీబీఎస్ సీట్ పొందడం అదృష్టం,డాక్టర్ వృత్తిని ఎంచుకోవడం గొప్ప విషయం అని కావున మానవతా దృక్పథంతో వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండలనే ఉదేశ్యం తో వారి కుమార్తె చదువుకు ఎటువంటి ఆటంకం కల్గకూడదనే ఉద్దేశ్యంతో కాకతీయ సేవ సమితి కూకట్పల్లి తరుపున కళశాల ట్యూషన్ ఫీజ్,ల్యాబ్,అడ్మిషన్ ఫీజులు చెల్లించడం జరిగినది అని వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటూ ఆ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటూ వారి జీవితాలలో వెలుగులు నింపడానికి నా వంతు సహాయ సహకారాలను అందిస్తున్నాను అని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు.ఈ విద్య సంవత్సరంకు గానుహో29,000/– రూపాయలను చెక్కు రూపేణా ఇవ్వడం జరిగినది అని,వారి ఆర్థిక స్థోమత లేక పేదవారు కావడం వలన కళాశాల ఫీజు కట్టుకోలేని స్థోమత లేకపోవడంహో చదువలకు ఆటంకం కల్గకుండా,విద్యార్థి భవిష్యత్తు ను దృష్టిలో పెట్టుకొని పాఠశాల ఫీజు 29,000 /– రూపాయలను చెక్కు రూపేణాహో కట్టడం జరిగినది అని,డాక్టర్ గా మంచిగా చదువుకొని,భవిష్యత్తు లో పేద వారికి వైద్య సేవలు అందిస్తూ మంచి పేరు ప్రఖ్యాతులు సంపాందించుకోవాలి అని , ఉన్నత శిఖరాలు అందుకోవాలని,మంచి భవిష్యత్తు ను ఏర్పరచుకొని ఉన్నత లో స్థిరపడాలని ఎమ్మెల్యే గాంధీ విద్యార్థి గాయత్రి ని ఆశీర్వదించడం జరిగినది.ఎప్పుడు ఏ సహాయం కావల్సిన తన వంతు కృషిహోచేస్తానని విద్యార్థికి చెప్పడం జరిగినది.దీనికి విద్యార్థి మరియు కుటుంబ సభ్యులు స్పందిస్తూహో కళశాల ఫీజు కొరకుహోఆర్థిక సహాయాన్ని అందించిన ఎమ్మెల్యే గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెల్పడం జరిగినది,మంచిగా చదువుకొని,పది మందికి ఉపయోగపడేలా ఉంటానని,నాహోపైహోచదువులకు ఆర్థిక సహాయాన్ని అందించిన ఎమ్మెల్యే గాంధీ ని జీవితం లో ఎప్పటికి మర్చిపోలేనని విద్యార్థిని చెప్పడం జరిగినది.ఈ కార్యక్రమంలో చపరాల శ్రీనివాస దాసు, గాంధీ,ఆనంద్,విద్యార్థి తండ్రి తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్లు ఉన్నా. వైద్య పరికరాలు సున్నా

■ ఆరోగ్య కేంద్రానికి అరాకొర వసతులు ■ తొర్రూర్ పట్టణంలోపేరుకే 30 పడగల ఆరోగ్య కేంద్రం ముప్పు తిప్పలు పడుతున్న పేషెంట్లు ■ గత పాలకుల నిర్లక్ష్యమే దీనికి కారణం అంటున్న స్థానిక ప్రజలు ■ ఉన్న వైద్యశాలను ఉట్టికెక్కించి వంద పడకల హాస్పటల్ గా అనుమతి తెచ్చిన గత పాలకులు ■ ఈ అంశంపై వార్తా ప్రభ తెలుగు దిన పత్రిక ప్రత్యేక కథనం (జిల్లా ప్రతినిధి పంతం సురేందర్)




**తొర్రూర్ ఆగస్టు 28 (వార్తా ప్రభ)** డాక్టర్లు ఉన్నా వైద్య పరికరాలు సున్నా అన్న చందంగా, తొర్రూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉండడం చర్చనీ అంశంగా మారింది. గత పాలకుల పది ఏళ్ల పాలల్లో, ఆరోగ్య కేంద్రానికి, చేసింది మాత్రం, నేతి బీరకాయలో నెయ్యి లాంటిదే కావడం విశేషం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరైన మౌలిక వసతులు లేకుండా, సరి అయిన సిబ్బందిని కూడా ఏర్పరచకుండా,ప్రభుత్వ వైద్యాన్ని పాడే ఎక్కించి, పేరుకు 30 పడకల ఆరోగ్య కేంద్రమే కానీ, పది పడకల గూడా వైద్యం అందించలేని దుస్థితికి, గత పాలకులు నెట్టివేయడం, గమనార్హం. 2014 తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్య వైద్యం సామాన్యులకు, అందుతాయని ప్రజల ఆకాంక్షిస్తే, ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగా చేశారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2023–9–30 నా వంద పడకల ప్రభుత్వ హాస్పిటల్ గా అప్గ్రేడ్ చేసి సరైన నిధులు కేటాయించకుండా, నూతన హాస్పిటల్ నిర్మాణ పనులు కూడా చేపట్టకుండా, పబ్బం గడపడంతో, పేదోడి ఆరోగ్య భద్రత పేపర్ కే పరిమితం అయిపోయిందని ప్రజలు బావాటంగా చర్చించుకుంటున్నారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గత 30 ఏళ్లుగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న తీరుగా, ఉండడం హాస్యాస్పదంగా మారింది. 2016 సంవత్సరంలో నూతన జిల్లాలుగా ఏర్పడిన సందర్భంగా తొర్రూర్ నూతన డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఆనాటి ప్రభుత్వం, “అంగట్లో అన్ని ఉన్నా అల్లుని నోట్లో శని ఉన్నట్లుగా” చేయడం విశేషం. దీనికి కారణం అధికారుల నిర్లక్ష్యమా, పాలకుల పరాకాష్టమ తెలియదు కానీ, వైద్య సిబ్బందిని కూడా అరాకొరగా నియమించి, పేద ప్రజల ఆరోగ్యానికి, పెనుముప్పుగా, మార్చడం, ద్వారా, ఈ ప్రాంత ప్రజలు వైద్య పరంగా ఇబ్బందులకు గురి కావడం ఆనవాయితీగా మారిపోయింది. డాక్టర్లు ఉన్నా కూడా, సరియైన వైద్య పరికరాలు లేక, వైద్యం చేయలేకపోవడం, మూలంగా ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. అయినా కూడా డాక్టర్లు శ్రమిస్తూ నార్మల్ డెలివరీ లు సాధ్యమైనంత మేరకు చేస్తున్నారు, ఆపద కాలంలో ఆపరేషన్ చేయాలంటే, ఆపరేషన్ థియేటర్ కూడా, ఆరోగ్య కేంద్రంలో లేకపోవడం, వైద్య పరికరాలు, ఏమీ లేకుండా పోవడం మూలంగా నిండు గర్భిణీలు, జిల్లా ఏరియా ఆసుపత్రిని ఆశ్రయించడం తప్పడం లేదు, లేదంటే వర్ధన్నపేట, ప్రభుత్వ హాస్పిటల్ ఆశ్రయించవలసి వస్తుంది, ఈ ప్రాంతం నుండి ఉన్నతమైన వైద్యం ఎక్కడైనా తీసుకోవాలంటే ఈ ప్రాంతానికి నలువైపులా 65 కిలోమీటర్లు పైననే, ప్రభుత్వ హాస్పిటల్స్ ఉండడం మూలంగా, చాలామంది రోగులు మరణించిన ఘటనలు లేకపోలేదు, కొత్తగా తొర్రూర్ డివిజన్ కేంద్రమైన తర్వాత 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని చెప్పిన గత పాలకులు, శంకుస్థాపనలకే పరిమితమయ్యారు తప్ప చేసింది ఏమీ లేదంటున్నారు. ఇకనైనా నూతన ప్రభుత్వం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పై దృష్టి సరించి స్థానిక డివిజన్ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రిని నిర్మించి, పేద ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించి, పూర్తి వైద్య సిబ్బందిని ఏర్పాటుచేసి, ఈ ప్రాంత ప్రజలకు న్యాయం చేకూర్చాలని ప్రజలు పేర్కొంటున్నారు.

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వండి

**జర్నలిస్టులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి**

**దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పై మంత్రి శ్రీధర్ బాబు తొ చర్చించిన జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ నేతలు**

**కుత్బుల్లాపూర్ ఆగస్టు 28 (వార్తాప్రభ) :** అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే ఇళ్ల స్థలాలిచ్చి గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి, మంత్రులు జర్నలిస్టులకిచ్చిన హామీని నెరవేర్చాలని పలువురు జర్నలిస్టు నేతలు ప్రభుత్వాన్ని కోరారు. గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పి. ఆనందం తదితరులు బుధవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసి వినతి పత్రం సమర్పించారు. దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పై మంత్రితో చర్చించారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉందని, ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఈ సమస్య జటిలంగా ఉందని అధ్యక్షుడు మామిడి సోమయ్య మంత్రితో అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పనిచేస్తున్న కొంత మంది జర్నలిస్టులకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లస్థలాలు ఇచ్చిందని, ఆ తర్వాత ప్రభుత్వాలు ఇవ్వలేదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పదేళ్లు అధికారంలో వున్న టీఆర్ ఎస్, బీఆర్ ఎస్ ప్రభుత్వం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పట్టించుకోలేదని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అయినా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలిచ్చి గత అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో సొసైటీ ప్రతినిధులు సీతారామచందర్ రావు,సీహెచ్ వీరారెడ్డి, వెంకట్ రెడ్డి, మహిళా జర్నలిస్టులు పి.నాగవాణి,పుష్పలత తదితరులున్నారు.



**జీవో ద్వారా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు– మంత్రి శ్రీధర్ బాబు** అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రత్యేక జీవో రావాలని, ప్రభుత్వం ఆ ప్రయత్నం చేస్తుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. సచివాలయంలో ఆయనను కలిసిన జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య చాలా కాలంగా ఉందని, ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనికి కొంత సమయం పడుతుందని అన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తుందని, జర్నలిస్టుల సమస్యల విషయంలో ముఖ్యమంత్రి చెప్పిన ప్రకారం చేస్తారని, అందుకు తనవంతు కృషి కూడా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు.

వార్తా ప్రభ

హైదరాబాద్

# ఎన్టీపీసీ సహకారం కోరుతూ విజ్ఞప్తి పత్రం!!

**సి.ఎస్.ఆర్. నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలి**

**కన్నూరి సతీష్ కుమార్, 20వ డివిజన్ కార్పొరేటర్**



**పెద్దపల్లి/ రామగుండం: ఆగస్టు 28 (వార్తాప్రభ ప్రతినిధి)** సి.ఎస్.ఆర్. నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలి అని వివిధ సమస్యలను ఎన్టిపిసి ప్రభావిత ప్రాంతమైన 20వ డివిజన్ పరిధిలోని పలు అంశాలను విజ్ఞప్తి పత్రం ద్వారా ఆ సంస్థ హెచ్ఆర్ డిజిఎం ప్రవీణ్ చౌదరికి నేరుగా తెలియజేశారు స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్. మల్యాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భవన మరమ్మతులతో పాటు రెండు అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని ఎస్టీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అదనపు గది నిర్మాణం చేపట్టాలని జీరో పాయింట్ నుంచి మల్యాలపల్లి పైప్ లైన్ వరకు సోలార్ స్ట్రీట్ లైట్లు ఏర్పరచాలని విజ్ఞప్తి పత్రంలో కోరారు.

# క్రీడలకు పెద్దపీట వేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి!!

**విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో సైతం రాణించాలి**

**మానసిక ప్రశాంతత, బాడీ ఫిట్నెస్ కోసం స్పోర్ట్స్ ఆడాలి**

**మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, రామగుండం శాసనసభ్యులు**



**పెద్దపల్లి/ రామగుండం: ఆగస్టు 28 (వార్తాప్రభ ప్రతినిధి)** సీఎం రేవంత్ రెడ్డి క్రీడలకు పెద్దపీట వేస్తూ అధిక ప్రాధాన్యత ఇవ్వడం శుభ సూచకమని అన్నారు రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్. ఈ మేరకు బుధవారం నియోజకవర్గంలోని ఎన్టీపీసీ జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి రామగుండం మండల స్థాయి క్రీడా పోటీలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ..... విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో సైతం రాణించాలి అని అన్నారు. మానసిక ప్రశాంతత, బాడీ ఫిట్నెస్ కోసం ప్రతి విద్యార్థి స్పోర్ట్స్ ఆడాలి అని సూచించారు. కార్యక్రమంలో జెడ్పి పాఠశాల హెడ్ మాస్టర్ జయరాజ్, బాలికల హై స్కూల్ హెడ్ మాస్టర్ మల్లేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



# మెరిట్ మోడల్ స్కూల్ లో ల్యూసిడా రైటింగ్ శిక్షణా శిబిరం ప్రారంభం

**కుత్బుల్లాపూర్ ఆగస్టు 28 (వార్తాప్రభ) :** చేతిరాత అందమైన మనస్తత్వానికి అద్దం పడుతుందని, అది కొందరికి మాత్రమే సాధ్యమవుతుందని మెరిట్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి అన్నారు. బుధవారం జీతే%శీ%దర్ హ్యాండ్ రైటింగ్ అకాడెమీ ఆద్వర్యంలో ఆ సంస్థ డైరెక్టర్, చేతిరాత నిపుణుడు, క్యాలిగ్రాఫర్ వంపు. మల్లయ్య వారం రోజుల చేతిరాత శిక్షణా శిబిరాన్ని జగద్గిరిగుట్ట శ్రీనివాస్ నగర్ లో ప్రారంభించారు. ఈ సందర్భ%శీ%గా ఆయన మాట్లాడుతూ...ల్యూసిడా హ్యాండ్ రైటింగ్ విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు, గ్రేడ్ లు సాధించడానికి, తక్కువ సమయం లో అందమైన చేతిరాత ను మన సొంతం చేసుకోవచ్చు అని అన్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. తల్లి తండ్రులు జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడెమీ నీ ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, నసీరుద్దీన్,ఉపాద్యాయులు స్వాతి,తదితరులు పాల్గోన్నారు.



# ఎడిటోరియల్

## బెంగాల్.. మరో బంగ్లాదేశ్ అవుతుందా?

పశ్చిమ బెంగాల్. తూర్పు-ఈశాన్య భారతంలో ఉన్న కీలకమైన రాష్ట్రం. అయితే.. కొన్నాళ్ల కిందట.. పొరుగున ఉన్న బంగ్లాదేశ్ లో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయో.. అచ్చం ఇప్పుడు బెంగాల్‌లోనూ అలాంటి పరిస్థితులే నెలకొన్నాయనడంలో సందేహం లేదు. ఇక్కడ జరుగుతున్న పరిణామాలను గమనిస్తే.. ఎవరో వెనుక ఉండి ప్రోత్సహిస్తున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోందని జాతీయ మీడియా కూడా చెబుతోంది. మంగళవారం.. రాష్ట్ర రాజధాని కోల్‌కతా వీధుల్లో రెండే రెండు అంశాలు కనిపించాయి. భీకరమైన బూట్ల చప్పుళ్లతో పరుగులు పెడుతూ.. లాఠీలకు, తుపాకులు పనిచెప్పిన పోలీసులు.రెండోది.. పోలీసుల బారి నుంచి తప్పించుకుంటూనే ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి వ్యతిరేకంగా .. ఉవ్వెత్తున ఎగిసి పడిన విద్యార్థి లోకం. ఎటు చూసినా.. ఈ రెండే కనిపించాయి. ఒక్క కోల్ కతాలోనే కాదు.. కీలక పట్టణం హౌరా, సహా అనేక ప్రాంతాల్లో -పశ్చిమబెంగా ఛాత్ర సమాజ్-ఇచ్చిన పిలుపులో భాగంగా విద్యార్థులు రోడ్డెక్కారు. మమతకు వ్యతిరేకంగా ర్యాలీలు తీశారు. తక్షణం ఆమె రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని కొన్ని చోట్ల అయితే.. మమత రాష్ట్రం వీడిపోవాలంటూ.. ప్లకార్డులు కనిపించడం గమనార్హం. ఈ పరిణామాలు.. రాష్ట్రాన్ని మంగళవారం రోజు రోజంతా అట్టుడికించాయి.ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పోలీసుల లాఠీ చార్జీల్లో పదుల సంఖ్యలో విద్యార్థులకు రక్తాలు కారాయి. ఒకరిద్దరికి తలలు పగలగా.. చాలా మంది విద్యార్థులకు కాళ్ల ఎముకలు చిట్టిపోయాయి. కాగా.. ఈ ఘటన వెనుక.. బీజేపీ ఉందని.. ప్రతిపక్షాలు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు(నిన్నమొన్నటి వరకు మమతను తిట్టిపోసిన పార్టీలు ఇవి) ఆరోపించడం చూస్తే.. తెరవెనుక జరుగుతున్న కుట్ర ఏంటనేది.. ఇట్టే అర్థమవుతోందన్నది జాతీయ మీడియా చెబుతున్న మాట. వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల్లో ఇక్కడ పగ్గాలు చేపట్టాలన్న ఢిల్లీ పెద్దల వ్యూహానికి విద్యార్థులు పావులు గా మారుతున్నారన్నది నగ్న సత్యం అంటున్నారు.కోల్‌కతాలోని ఆర్జీకర్ కళాశాలలో ఈ నెల 9న జూనియర్‌వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారానికి సంబంధించి కొన్నాళ్ల కిందట రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. అయితే.. ఈ కేసులో అధికార పార్టీ కొందరిని కాపాడుతోందన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయి. దీంతో కొన్ని శక్తుల చేతిలో విద్యార్థులు పావులుగా మారారు. తాజాగా రెండు రోజుల నుంచి సీఎం మమత రాజీనామా కు పట్టుబడుతున్న విద్యార్తులు(వీరిలో వైద్య విద్యార్థులు లేకపోవడం గమనార్హం) నిరసనకు దిగారు.ఈ నిరసనే సంక్లిష్టతకు చేరుకుని,.. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసానికి కూడా దారితీసింది. ఇదిలావుంటే.. బుధవారం రాష్ట్ర బంద్‌కు బీజేపీ పిలుపునివ్వడం గమనార్హం. కాగా, అందరి వేళ్లూ.. కమల నాథుల వైపే చూపిస్తున్నాయి. పరిస్థితిని చక్కదిద్దాల్సింది పోయి.. మరింత రెచ్చగొట్టడం గమనార్హం. బంగ్లాదేశ్‌లోనూ.. విద్యార్థుల రగడ.. పొరుగు దేశాల మద్దతుతోనే.. హసీనా..రాజీనామా చేయడం..దేశం వదిలి పారిపోవడం తెలిసిందే. అయితే.. మమత మొండి ఘటం కావడంతో ఇక్కడ పరిస్థితి ఏ నిముషానికి ఏం జరుగుతుందో అనే విధంగా మారిపోయింది.

## చెల్లిపై అన్న గొడ్డలితో దాడి

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 28 (వార్తా ప్రభ ప్రతినిధి):-** మద్యం మత్తులో చెల్లిపై అన్న గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన కొండపల్లి పట్టణంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కొండపల్లి ఖిల్లా రోడ్డు సెంటర్ సమీపంలోని స్వర్గం ఫ్యామిలీ రెస్టారెంట్ పక్కన అన్నాచెల్లెళ్లు వెంకట్రావు (46), నాగమల్లేశ్వరి (43) సొంతింటిలోని వేర్వేరు పోర్షన్లలో ఉంటున్నారు. మద్యం మత్తులో వెంకట్రావు పలుమార్లు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోవాలని అవివాహితురాలైన చెల్లెలు నాగమల్లేశ్వరితో గొడవ పడేవాడు. ఈ క్రమంలో బుధవారం మద్యం మత్తులో చెల్లెలుతో గొడవపడ్డాడు. విచక్షణ కోల్పోయి గొడ్డలితో ఆమె వీపు మీద దాడి చేసి గాయపరిచాడు. చికిత్స నిమిత్తం ఆమెను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి కొండపల్లి సెక్టార్ ఎస్సై ఎస్.పాపారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వాడుక భాషా ఉద్యమ పితామహుడు "గిడుగు"




మన వెంకట రామమూర్తి గిడుగు
వ్యావహారిక తెలుగుకు గొడుగు
ఉద్యమం చేసి తెచ్చెను వెలుగు
అందరికి చేరువాయె తెలుగు
వ్యావహారిక భాష పితామహుడు
గిడుగు రామమూర్తి గారు ఘనుడు
తెలుగోళ్ల గుండెల్లో ఉన్నోడు
అహర్నిశలూ పూజనీయుడు
చరిత్ర , శాసన పరిశోధకుడు
ప్రాముఖ్యంగా ఉపాధ్యాయుడు
మాతృభాష కొరకు పోరాడిన
ఆదర్శమూర్తి గిడుగు పిడుగు
రామమూర్తి జన్మ దినము నేడు
వీరికి సరి సాటి లేనేలేడు
వాడుక భాష తెలుగు అమలుకు
ఉద్యమించి గెలిచిన యోధుడు

**-గద్వాల సోమన్న**
9966414580

## విజయవాడలోని ద్విచక్ర వాహన చోదకులారా తస్మాత్ జాగ్రత్త.....

- విజయవాడ ట్రాఫిక్ పోలీసులను నమ్మకండి.... తలపై హెల్మెట్ ని మాత్రమే నమ్మండి...
- నగర ట్రాఫిక్ పోలీసుల అడుగులు సామ వేద దాన దండోపాయం వైపుకే...

**(యేమినేని వెంకట రమణ)**







**విజయవాడ పశ్చిమ ఆగస్టు 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడలో ని ద్విచక్ర వాహన చోదకులారా మీరంతా నగర ట్రాఫిక్ పోలీసులను నమ్మకండి. మీ ప్రాణాలు రక్షించే హెల్మెట్ లనే నమ్మండి ఇదంతా ఎందుకు చెబుతున్నామంటే నేడు మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ మనతో ట్రాఫిక్ విధులు నిర్వహింపజేస్తున్నారు. హెల్మెట్ కొనేవరకు మీ వహనాలని వారి అదుపులోకి తీసుకుని హెల్మెట్ కొన్నాక మాత్రమే మీ వాహనాలు మీకు ఇస్తున్నారు. ఇదంతా సామ వేద దాన దండోపాయం సూత్రమే అని గ్రహించండి. వాహన చోదకులు హెల్మెట్ లేని కారణంగా అకాల మృత్యువాత పడుతున్నారని ఆర్టీఏ వారు,ట్రాఫిక్ పోలీసులు నిర్లక్ష్యంగా ఉన్నారని హైకోర్టు ఇటీవలే సంబంధిత శాఖ అధికారులకు మొట్టికాయలు వేసింది. దాంతో ఉలిక్కిపడి ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ ధరించని వాహన చోదకులపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించారు. దాంతో విజయవాడ నగరంలో ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగారు. వాహన దారులకు హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు, హెల్మెట్ లేకుంటే రోడ్డు ప్రమాదంలో అసువులు బాస్తున్న అభాగ్యుని కుటుంభ సభ్యుల స్థితిగతులు వివరిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు తొలివిడతగా హెల్మెట్ లేనివారితో ట్రాఫిక్ విధులు చేయిస్తున్నారు. అలాగే ట్రాఫిక్ సిబ్బంది ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ లేకపోవడంతో బుధవారం ప్రకాశం బ్యారేజీ వద్ద వారికి కౌన్సిలింగ్ ఇచ్చిన వన్ ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు హెల్మెట్ లేని వాహనదారులకు కొంతమంది కి హెల్మెట్ కొని చూపించాకే వారి వాహనాలు వారికి ఇవ్వడం జరిగింది.విజయవాడ సిటీ ఎన్టీఆర్ డిస్ట్రిక్ట్ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఉత్తర్వులు మేరకు, ట్రాఫిక్ డిసిపి కె చక్రవర్తి పర్యవేక్షణలో, ట్రాఫిక్ ఎడిసిపి ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో వన్ ట్రాఫిక్ సెక్టర్ సిఐ ఏ ఉమామహేశ్వర రావు వారి యొక్క సిబ్బందితో ప్రకాశం బ్యారేజీ మీద హెల్మెట్ ధరించని టూవీలర్ వారిని ఆపి, వారి చేత హెల్మెట్ ఇంటి దగ్గర నుండి తెప్పించి, లేదా కొనుగోలు చేపించి, మరియు వారితో ట్రాఫిక్ డ్యూటీ చేపించి, ప్రతిరోజు ఎంతమంది హెల్మెట్ లేకుండా వెళుతున్నారో వాళ్లకు తెలిసే విధంగా చూపిస్తూ, హెల్మెట్ లేకుండా వెళితే జరిగే ప్రమాదాలు వివరిస్తూ, ట్రాఫిక్ రూల్స్ తెలియపరుస్తూ ట్రాఫిక్ పై అవగాహన కల్పించారు. అరె ఇంతేగా అనుకోవద్దు

**ఇకముందు హెల్మెట్ లేకుంటే మీకు మూడిందే** ట్రాఫిక్ విధులు నిర్వహించిన హెల్మెట్ లేని వాహన చోదకులు దాన్ని సీరియస్ గా తీసుకోవడంలేదనే చెప్పాలి. తాము సరదాగా విధులు. నిర్వహించామని చెప్పుకోవడం జరుగుతుంది.ముందు ముందు ఈ నిబంధనలు ఎంత కఠినంగా ఉంటాయో ట్రాఫిక్ పోలీసులను తక్కువగా అంచనా వేయొద్దని ఇది పోలీసులు హెచ్చరికలని వాహన చోదకులు గ్రహించాలి.గతంలో హెల్మెట్ లేని వారికి గులాబీ పూలు అందించిన పోలీసులే నేడు ట్రాఫిక్ విధులు చేయిస్తున్నారు. గతంలో కేవలం జరిమానా విధించిన పోలీసులే నేడు హెల్మెట్ చూపిస్తేగాని ద్విచక్ర వాహనాలు యాజమాని కి ఇవ్వడంలేదు. రాను రాను డ్రైవింగ్ లైసెన్సు లు రద్దు చేయాలనే తలంపుతో ముందుగా సామ వేద దాన దండోపాయం మార్గం అనుసరిస్తున్నారు అందుకే ట్రాఫిక్ పోలీసులను నమ్మకండి... ప్రతి ఒక్కరూ హెల్మెట్ లనే నమ్మండని చెప్పాల్సి వస్తుంది.బుధవారం ఉదయం జరిగిన హెల్మెట్ వాడకం అవగాహన కార్యక్రమంలో వన్ ట్రాఫిక్ సిఐ ఉమామహేశ్వరరావు తో పాటుగా ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్స్ గోపి,తిరుపతి, రాహీమ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల కళ్ళల్లో సంతోషమే ముఖ్యం

- సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి



**పొదలకూరు ఆగష్టు 28 (వార్తాప్రభ)** రైతుల కళ్ళల్లో సంతోషమే తనకు ముఖ్యమని సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు.బుధవారం పొదలకూరు మండలంలో ఆయన పర్యటించారు.ఆయన చేతుల మీదుగా స్విచ్ ఆన్ చేసి కండలేరు ఎడమ కాలవకు నీటిని విడుదల చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కండలేరుకు సోమశిల జలాశయం నుండి నీటిని విడుదల చేస్తున్నా మన్నారు.అలాగే కండలేరు జలాశయం నుండి 2.6 క్యూసెక్కుల నీటిని ఎడమ కాలవల ద్వారా ఆరు మండలాలకు సాగునీరు తాగునీటిని విడుదల చేశామన్నారు.తద్వారా ఆరు మండలాల్లో 20,704 ఎకరాల పంటకు నీరు అందించే పరిస్థితి తెచ్చామన్నారు.రైతుల కళ్ళల్లో ఆనందం చూడటమే తమ లక్ష్యమన్నారు. వారు సంతోషంగా ఉంటేనే దేశమంతా సంతోషంగా ఉంటుందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నీటి పారుదల రంగాలను పూర్తిగా నిర్వీర్యం చేశాయన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం నీటి పారుదల రంగాలను గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కంకణం కట్టుకున్నారన్నారు.ప్రసయ రాష్ట్రంలోని అన్ని డ్యామ్ లు పూర్తి సామర్థ్యంతో వున్నాయన్నారు. తెదేపా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అన్నివేళలా అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎస్ఇ ఎంవి రమణారెడ్డి ఈఈ విజయ్ కుమార్ రెడ్డి ఈఈ అనిల్ కుమార్ రెడ్డి డిఈఈ విజయ రామిరెడ్డి డిఈఈ ప్రసూన ఏఈ తిరుమలయ్య వెంకటేశ్వర్లు సుమన్ తెదేపా నాయకులు పులిపాటి వెంకటరత్నం నాయుడు మండల అధ్యక్షులు తలచీరు మస్తాన్ బాబు జమీర్ భాష ఉప్పలమర్తి ప్రభాకర్ రెడ్డి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ వైద్య సేవలు డబ్బులు వసూలు చేసినచో కఠిన చర్యలు!!!



**మచిలీపట్నం ఆగస్టు 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం బుధవారం ఎన్టీఆర్ వైద్య సేవలు కింద పని చేసే నెట్వర్క్ ఆసుపత్రిలో పేద రోగుల నుండి డబ్బులు వసూళ్లకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ హెచ్చరించారు. డిసిసి జిల్లాలో ఎన్టీఆర్ వైద్య సేవల సమీక్ష కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవలు ఆసుపత్రుల పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవల పథకంలో పనితీరును ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.కొన్ని ఆసుపత్రులలో రోగ నిర్ధారణ నిమిత్తం రోగుల నుండి డబ్బులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని అవి నిర్ధారించి డిసిసి కమిటీ విచారణ జరిపి బాధ్యులైన ఆసుపత్రి యాజమాన్యాలకు భారీగా జరిమానాలు విధించారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ఏ ఒక్క రోగి ఇబ్బందులు పడిన సహించేది లేదని ఆసుపత్రుల యాజమాన్యాలు భారీ మూల్యం చెల్లించుకోవాలని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా వైద్యసేవాధికారి గీతా బాయి, డిసిహెచ్ఎస్ శ్రవణ్ కుమార్, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రూ. రెండు కోట్లతో గ్రామాభివృద్ధి - ఎంపీపీ జూటూరు హేమలత

**కర్నూలు ఆగస్టు 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మండలంలో రూ.రెండు కోట్ల వ్యయంతో గ్రామాభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎంపీపీ జూటూరు హేమలత తెలిపారు. బుధవారం చిప్పగిరి మండల కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రూ. రెండు కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాన్ని త్వరలో చేపడతారన్నారు. ఈ సందర్భంగా విద్యుత్తు, తాగునీరు, గృహ నిర్మాణం తదితర అంశాలపై సభ్యులు అధికారులను నిలదీశారు. ఖాజీపురం జలాశయం నుంచి తాగునీటిని శుద్ధి చేసి సరఫరా చేయాలని ఎంపీటీసీ సభ్యురాలు రజిని కోరారు. బెల్లోనలో గృహ నిర్మాణం అధ్వానంగా ఉందని సర్పంచ్ పార్వతి అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఇజాజ్ అహ్మద్, మండల విద్యాధికారి సావిత్రి, ఏవో జయలక్ష్మి, మండల వైద్యాధికారిని పార్వతమ్మ, ఏఈలు సర్పంచులు, ఎంపీటీసీలు, శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షతగదు- అరుణ్ కుమార్!!!




**మచిలీపట్నం ఆగస్టు 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపట్లవివక్ష చిన్న చూపు తగదని అంకిత ప్రాజెక్ట్ మేనేజర్ టి అరుణ్ కుమార్ అన్నారు.ఎయిడ్స్/హెచ్ఐవి, క్షయ వ్యాధులపట్ల కృష్ణాజిల్లాలో రెండు నెలల పాటు జరిగే అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇందిరానగర్ కాలనీలో డ్వాక్రా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన మీకు తెలుసా? కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ,ఎయిడ్స్/ హెచ్ఐవి అంటువ్యాధి కాదని ఎయిడ్స్/ హెచ్ఐవి వ్యాధి సోకిన వారిని ముట్టుకున్నా,వారితో కలిసి తిరిగి నా,వ్యాధిసోకదని అందువల్ల వారిని చిన్నచూపు చూడకుండా వారిపట్లసోదరభావంచూపించాలని అన్నారు. హెచ్ఐవి/ ఎయిడ్స్,క్షయ వ్యాధిసంబంధంగురించి,సుఖ వ్యాధులు చికిత్స గురించి, హెచ్ఐవి/ఎయిడ్స్ యాక్ట్ 2017, మందులు,టోల్ ఫ్రీనెంబర్ 1097 గురించి విద్యార్థిని,విద్యార్థులకు తెలియజేశారు. ఇందిరా నగర్ కాలనీ డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన ఈ సదస్సులో పాల్గొన్న గ్రామంలోని మహిళలు పురుషుల కు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం జి.లావణ్య, పిడిజి బేబీ సరోజినీ.అంకిత సభ్యులు కే.పార్వతి, బి లలిత, బి నాగ మారుతి, సిహెచ్ క్రాంతి,ఎం రాజమ్మ, డి జ్యోతి, పి విజయదుర్గ, జి నాగమణి, బి విజయకుమారి, సిబ్బంది,పాల్గొన్నారు.

## జితారా కంపెనీ సెలక్షన్స్ లో ఆర్కే విద్యార్థుల ప్రతిభ



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 28(వార్తా ప్రభ ప్రతినిధి):-** మండల పరిధిలోని ఆ ర్ కె కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ జితారా కంపెనీ ఉద్యోగుల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాలలోని 10 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ ద్వారా ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణయ్య మాట్లాడుతూ తమ ప్రతిభతో విజయం సాధించిన విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ గొప్పతనం అకడమిక్ ఎక్సలెన్స్ మరియు ఇండస్ట్రీ సంసిద్ధత పట్ల కళాశాల యొక్క నిబద్ధత ప్రత్యేకత అని తెలిపారు.ఎంపికైన విద్యార్థులు సాంకేతిక రంగంలో ఆవిష్కరణలు మరియు వృద్ధికి ప్రసిద్ధి చెందిన ప్రముఖ సంస్థ అయిన జితారా లో వివిధ విభాగాలలో స్థానాలను పొందడం ద్వారా అసాధారణ నైపుణ్యాలు మరియు సామర్థ్యాన్ని ప్రదర్శించారు.వారి సాఫల్యం వారి వృత్తిపరమైన ప్రయాణాన్ని మెరుగుపరచడమే కాకుండా భవిష్యత్ గ్రాడ్యుయేట్ లకు బెంచ్‌మార్క్‌ను సెట్ చేస్తుందని ఆయన అన్నారు.యాజమాన్యం వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఐ సాయిరాం మరియు ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ నరేంద్ర సంతోష్ కుమార్, సిబ్బంది విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## 29న జరిగే వేలంపాటను సద్వినియోగం చేసుకోండి

**అనుమసముద్రంపేట ఆగష్టు 28 (వార్తాప్రభ)** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అనుమసముద్రంపేట మండలం అనుమసముద్రంపేట గ్రామపంచాయతీ నందు సర్పంచ్ శ్రీ మతి షేక్ తాజున్నిసా అధ్యక్షతన 29/8/2024వ తేదీన ఉదయం 11 గంటలకు శ్రీ శ్రీ శ్రీ హజరత్ ఖాజా నాయబ్ -ఇ- రసూల్ వారి దర్గాకు వచ్చే ప్రైవేటు వాహనములకు రుసుము వసూలు చేసుకునే హక్కు 01-09-2024 తేదీ నుండి 30-08-2024 వరకు అనగా చిన్న ఉరుసు గంధ మహోత్సవం మరియు పెద్ద ఉరుసు గంద మహోత్సవం వరకు పదవీకాలం 30 రోజులు ఇవ్వడమైనది.కనుక ఆసక్తి కలవారు అందరూ వేలంపాటలో పాల్గొనవచ్చునని డిపాజిట్ పదివేల రూపాయలు చెల్లించి పాటలో పాల్గొనాలని చూసించారు.పాట తెగిన వెంటనే సగభాగం చెల్లించాలని తదుపరిపైకము 48 గంటల లోపల చెల్లించాలని గ్రామపంచాయతీ కార్యదర్శి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా అనుమ సముద్రంపేట మండల ప్రజలందరూ వేలం పాటలో పాల్గొనవలసిందిగా కోరడమైనది వారు తెలిపారు.

## గణేష్ ఉత్సవాలపై సమీక్ష సమావేశం



**కర్నూలు: ఆగస్టు 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో గణేష్ ఉత్సవాలపై వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసు బందోబస్తు, తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన రావు, సంబంధిత శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఉపాధ్యాయిని కృపావతికి మదర్ థెరీసా జాతీయ అవార్డు




**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 28 (వార్తా ప్రభ ప్రతినిధి):**– కొండపల్లి పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయిని చిరివెళ్ల కృపావతికి అరుదైన గౌరవం దక్కింది. ఎన్నో సంవత్సరాల నుంచి అనాథ పిల్లలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఆమెకు మదర్ థెరీసా జాతీయ అవార్డు – 2024 లభించింది. మదర్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మదర్ థెరీసా జయంతి సందర్భంగా నగరంలోని గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. రెడ్డిగూడెం మండలం కుదప జడ్పీ హైస్కూల్ లో ఇంగ్లిష్ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కృపావతి ప్రతి ఏటా అనాథాశ్రమంలో పిల్లలకు ఆహారం, వారికి కావలసిన సామగ్రి అందిస్తున్నారు. ఆమె సేవలను గుర్తించిన మదర్ సర్వీస్ సొసైటీ అవార్డు ప్రదానం చేసి కృపావతి దంపతులను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత కృపావతి బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది ఉత్తమ విద్యాబోధన చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందించి సత్కరించిందన్నారు. ఇప్పుడు మదర్ థెరీసా జాతీయ అవార్డు లభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డులు సమాజ సేవపై తనకు మరింత బాధ్యత పెంచాయని తెలిపారు. సేవా కార్యక్రమాలను తన తల్లిదండ్రుల నుంచి అలవర్చుకున్నట్లు చెప్పారు. సేవా కార్యక్రమాల ద్వారా లభిస్తున్న సంతృప్తి మరెక్కడా లేదన్నారు. తన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన మదర్ సర్వీస్ సొసైటీ ఫౌండర్ మల్లాది ప్రసాదరావుకు ధన్యవాదాలు తెలిపారు.

# అద్భుత చిత్రం గీసిన డ్రాయింగ్ మాస్టర్ తోట కిషోర్ కుమార్

**చేజర్ల ఆగష్టు 28 (వార్తాప్రభ)** తెలుగు భాషా దినోత్సవం ఆగష్టు 29 సందర్భంగా బుధవారము చేజర్ల జిల్లా పరిషత్ హై స్కూల్ లో డ్రాయింగ్ మాస్టర్ గా పనిచేస్తున్న తోట కిషోర్ కుమార్ ఓ అందమైన చిత్రాన్ని గీశారు ఆయన గీసిన చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. ఆయన 2002వ సంవత్సరంలో జాతీయ స్థాయిలో బెస్ట్ క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డును అందుకున్నారు తరువాత 2003 వ సంవత్సరం జాతీయ స్థాయిలో అకాడమిక్ ఎక్సెలెన్స్ అవార్డుతో గోల్డ్ మెడల్ అందుకున్నారు. బెస్ట్ ఆర్టిస్టుగా అతనిని మండలంలో అందరూ ప్రశ్నిస్తున్నారు.



# ఏఎస్ పేట ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సైదులు

**అనుమసముద్రంపేట ఆగష్టు 28 (వార్తాప్రభ)** మండల నూతన ఎస్ఐ గా ఎ.సైదులు బుధవారం బాధ్యతలు చేపట్టినారు. నెల్లూరు సిటీ చిన్న బజార్ పిఎస్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీల్లో ఏఎస్ పేటకు నియమితులయ్యారు. ఆ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించడం జరిగినది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ రెడ్డి విఆర్ కు బదిలీ అయ్యారు. నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సైదులు అనంతరం స్థానికంగా ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ స్వాములవారి దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రం ఉన్న ఇక్కడకు ఎస్ఐగా రావడం ఎంతో ఆనందంగా ఉందని శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు తమ సహాయ సహకారాలు అందించాలని ముఖ్యంగా దర్గా సెంటర్లో ట్రాఫిక్ పై దృష్టి పెడతానని అలాగే దర్గాకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్నివేళ పోలీస్ రౌండ్స్ నిర్వహిస్తా మన్నారు. మండల ప్రజలు లా అండ్ ఆర్డర్ పరంగా ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని చూసించారు. చట్టాన్ని ఎవరు కూడా ఉల్లంఘించ రాదన్నారు. నూతన ఎస్ఐ ను స్థానిక పోలీస్ అధికారులు సిబ్బంది ఘన స్వాగతం పలుకుతూ అభినందనలతో శుభాకాంక్షలు తెలిపారు.






# పెనుగంచిప్రోలు ఎస్ఐ గా ఎం ఎస్ కె అర్జున్

**పెనుగంచిప్రోలు ఆగస్టు 28 (వార్తప్రభ)** పెనుగంచిప్రోలు ఎస్ఐ గా ఎం ఎస్ కె అర్జున్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు, ముందుగా శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకొని అనంతరం బాధ్యతలు స్వీకరించారు.



# ప్రజలను దోచుకుంటున్న మెడికల్ మాఫియా

- ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రైవేట్ ఆసుపత్రుల ఆఫర్లు
- కమీషన్ల కోసం కొందరు అనైతిక పద్ధతులు
- స్థాయికి మించిన వైద్యంతో సామాన్యులకు చిక్కులు

**జగ్గయ్యపేట ఆగస్టు 28 (వార్తప్రభ)** వైద్యోనారాయణో హరి అనేది నానుడి. గ్రామీణ ప్రాంతాల్లో జ్వరం వచ్చినా చిన్నచిన్న జబ్బులు చేసినా స్థానిక ప్రైవేట్ వైద్యులే చికిత్స చేసి తక్కువ ఖర్చుతో ప్రాణాలను కాపాడేవారు. అందుకే వారిని ప్రజలు దేవుడితో సమానంగా భావించేవారు. కానీ రానురాను ఆ పరిస్థితి మారిపోతోంది. పల్లెలు, మారుమూల గ్రామాలే కాకుండా పట్టణ ప్రాంతాల్లోని కొన్ని వీధులే లక్ష్యంగా చేసుకుని మెడికల్ మార్కెటింగ్ వ్యవస్థ మాఫియాలా మారిపోతోంది. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ఆర్ఎంపీ, పీఎంపీలను లక్ష్యంగా చేసుకుని ఆఫర్లతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ ఆఫర్ల మైకంలో పడిన కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు అడ్డదారులు తొక్కుతూ అనైతిక వ్యవహారాలకు పాల్పడుతున్నారు. ఫలితంగా సామాన్యులు ఆరోగ్యంతో పాటు డబ్బు కూడా నష్టపోతున్నారు.

## మార్కెటింగ్ మాయ

ఒక్కప్పుడు బడా కార్పొరేట్ ఆసుపత్రులు తమకంటూ ప్రత్యేకంగా మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేది. వివిధ జబ్బులతో బాధపడేవారిని తమ వద్దకు రిఫర్ చేయాలంటూ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రులను కోరేది. అలా ఆసుపత్రుల మధ్య పోటీ పెరిగి చివరకు జిల్లా కేంద్రాల నుంచి గ్రామాల వరకు మెడికల్ మార్కెటింగ్ వ్యవస్థ విస్తరించింది. చిన్న, పెద్ద, కొత్త, పాత తేడా లేకుండా వ్యాధిగ్రస్తులను రిఫర్ చేసిన ఆర్ఎంపీ, పీఎంపీలకు ఆకర్షణీయమైన ఆఫర్లు, ప్యాకేజీలను ప్రైవేట్ ఆసుపత్రులు ప్రకటిస్తున్నాయి. పలు ప్రైవేట్ ఆసుపత్రులు బంపర్ ఆఫర్లు ఇస్తున్నాయి. ఈ బంపర్ ఆఫర్లు ప్యాకేజీలు అనేక రకాలుగా ఉంటున్నాయి. ఆర్ఎంపీ, పీఎంపీలు పంపిన వారు ఇన్‌పేషెంట్‌గా చేరితే ఆ రోగికి చెల్లించే ఫీజులో 30 శాతం, వివిధ టెస్టులకు సంబంధించి వేసే బిల్లుల్లో 50 శాతం వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం. కొన్ని కొత్త ఆసుపత్రులయితే నిలదొక్కుకునేందుకు ఔట్‌పేషంట్ విభాగంలోనూ ఆఫర్లు అందిస్తున్నాయి. ఒక నిర్ణీత సమయంలో లక్ష్యానికి మించి రోగులను రిఫర్ చేస్తే పలు బహుమతులు ఆఫర్ చేస్తున్నారు.

## సామర్థ్యానికి మించి వైద్యం

నిబంధనల ప్రకారం ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స వరకే పరిమితం కావాలి. సర్టిఫైడ్ డాక్టర్ సూచించిన ప్రిస్క్రిప్షన్ ఆధారంగా సెలెన్ పెట్టడం, మందులు ఇవ్వడం, ఇంజెక్షన్ వేయడం వంటి సేవలు చేయవచ్చు. నేరుగా పరీక్షించడం, రోగ నిర్ధారణ చేయడం మందులు ఇవ్వడం చేయకూడదు. కానీ ఈ నిబంధన అమలు కావడం లేదు. అయితే ఇదే సమయంలో తక్షణ వైద్యసేవలు అందించే వారిగా ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రజల మనస్సును గెలుచుకుంటున్నారు. దీంతో కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు తమ సామర్థ్యానికి మించి వైద్యసేవలు అందిస్తూ ప్రజల ప్రాణాలకు చేటు తెస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో ఈ తరహా ఘటనలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి.

## సెటిల్‌మెంట్లతో సరి

ఔషధాలకు ఉండే పరిమితులు, శరీర ప్రతిస్పందనలు తదితర అంశాలపై అవగాహన లేకుండానే ఆర్ఎంపీ, పీఎంపీలు వైద్యసేవలు అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భవిచ్ఛిత్తి మాత్రలు అందిస్తున్నారు. దీంతో తీవ్ర రక్తస్రావం జరిగి అనేక మంది అనారోగ్యం భారిన పడుతుండగా మరికొందరు ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఇలాంటి ఘటనలు పలు గ్రామీణ ప్రాంతాల్లో వెలుగుచూస్తున్నాయి. ఏదైన అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు గ్రామ స్థాయిలో వాటిని సెటిల్‌మెంట్ చేస్తూ విషయం బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు.

## కమీషన్లకు కక్కుర్తి

ప్రైవేట్ ఆసుపత్రుల మార్కెటింగ్ విభాగాలు అందిస్తున్న ఆఫర్ల మైకంలో ఉంటున్న ఆర్ఎంపీ, పీఎంపీలు నైతికంగా దిగజారిపోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వైద్యసేవల కోసం తమ వద్దకు వచ్చే వారిని అవసరం లేకున్నా ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారనే వాదన వినిపిస్తోంది. ఎక్కువ మొత్తంలో కమీషన్లు వచ్చేందుకు అవసరం లేకపోయినా వివిధ పరీక్షలు, అధిక మందులు రాయాలంటూ ఆర్ఎంపీలు, పీఎంపీలు ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. తాము చెప్పినట్లు అధికంగా టెస్టులు మందులు రాయకపోతే మరో ఆసుపత్రికి




రిఫర్ చేస్తామని శాసించే స్థాయికి ఆర్ఎంపీలు, పీఎంపీలు చేరుతున్నారని పలు ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు సైతం చెబుతున్నారు. అయితే ప్రభుత్వపరంగా ఆసుపత్రుల మార్కెటింగ్, రిఫర్ చేసే పద్ధతుల నివారణకు ఎటువంటి నిబంధనలు లేవు. ఆసుపత్రులపై వైద్యఆరోగ్యశాఖ మరింత నిఘా పెట్టి మెడికల్ మాఫియాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**రేపటి వార్తప్రభ దినపత్రిక కథనము లో చదివిన వైద్యం ఒకటి చేసే వైద్యం ఒకటి నిండా దోచుకుంటున్న ల్యాబులు, మెడికల్ షాప్ లలో స్పెషలిస్ట్ డాక్టర్ల పేరుతో నడుపుతున్న అక్రమ దందాలపై పూర్తి వివరాలు**

# గంజాయి మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలించాలి- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి!!!



**మచిలీపట్నం ఆగస్టు 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం ఈనెల 31 తేదీన పెడనలో నిర్వహిస్తున్న న్యాయ సేవ శిబిరానికి సమన్వయంతో అన్ని ఏర్పాట్లు సజావుగా పూర్తి చేయాలని జిల్లా న్యాయ సేవా సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వి రామకృష్ణయ్య జిల్లా అధికారులకు సూచించారు. బుధవారం ఉదయం నగరంలోని న్యాయస్థానాల సముదాయంలోగల న్యాయ సేవా సదన్ లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జిల్లా ఇన్చార్జి రెవెన్యూ అధికారి జి శ్రీదేవి తో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి నూతన న్యాయ సేవా శిబిరం ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నూతన విధానంలో న్యాయ సేవా శిబిరాన్ని ఈనెల 31వ తేదీన ఉదయం 10 గంటలకు పెడన మండలం నందమూరు గ్రామంలోని వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా గంజాయి వంటి మత్తుమందు వాడకం రాను రాను ఎక్కువైందని పాఠశాల విద్యార్థుల వద్దకు చేరుతుందన్నారు. దీనిని నివారించడంతోపాటు బాధితులకు న్యాయ సేవలు అందించడం, ఆ మత్తుమందు ముప్పు నిర్మూలన, సీనియర్ సిటిజనులకు గల హక్కులు, ప్రయోజనాలు, న్యాయ సేవలు అనే అంశాలపై ప్రధానంగా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యకలాపాలను వివరిస్తామన్నారు. అంతేకాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను, వాటి ప్రయోజనాలను వివరిస్తూ సంబంధిత ప్రభుత్వ శాఖలు ప్రదర్శనశాలలు ఏర్పాటు చేయడంతో పాటు దరఖాస్తు పత్రాలు, కరపత్రాలు, బ్రోచర్లు పంపిణీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ శిబిరంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తితో పాటు జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు అధికారి పాల్గొంటారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అగ్ని ప్రమాదాలు నియంత్రించడానికి అవసరమైన అగ్నిమాపక యంత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వేదిక వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్య పరీక్షలు చేసి కావాల్సిన మందులు ఇచ్చేందుకు వీలుగా వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. శిబిరానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి న్యాయ సేవ శిబిరం జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి ఎస్ వి డి ప్రసాద్, జిల్లా అగ్నిమాపక అధికారి డి ఏసు రత్నం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్రావు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి అబ్దుల్ రబ్బాని, ఎల్డిఎం జయవర్ధన్, ఉపవిద్యాధికారి శేఖర్ సింగ్, డి ఆర్ డి ఏ ఏ పీ ఎం రాజా గోవింద్, సహాయ బీసీ సంక్షేమ అధికారి అలియా బేగం తదితర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు

# 72 అడుగుల శ్రీ విజయ మహాగణపతి నమూనాను ఆవిష్కరించిన మంత్రి రామనారాయణరెడ్డి



**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 28: (వార్తా ప్రభ ప్రతినిధి)** డూండీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో 72 అడుగుల శ్రీ విజయ మహాగణపతి మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డి ప్రశంసించారు. బుధవారం విజయవాడ విద్యాధరపురంలోని లేబర్ కాలనీ గ్రౌండ్లో నుండి డూండీ గణేశా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 72 అడుగుల శ్రీ విజయ మహాగణపతి విగ్రహాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా సేవా సమితి ఆధ్వర్యంలో రూపొందించిన ఆహ్వాన పత్రికను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎనిమిది ప్రముఖ దేవాలయాల నుండి కల్యాణోత్సవ విగ్రహాలను ఇక్కడకు తీసుకువచ్చి ప్రతినిత్యం కళ్యాణాలను నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రజల్లో భక్తి భావం పెంపొందించేలా ఇటువంటి సేవా కార్యక్రమాలను చేయాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలోనే దసరా ఉత్సవాల సందర్భంగా కృష్ణమ్మకు నదిహారతులను ఇచ్చే కార్యక్రమం పునః ప్రారంభిస్తామని చెప్పారు . ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, డూండీ గణేశ సేవ సమితి నిర్వాహకులు డూండీ రాకేష్ , తెలుగుదేశం నాయకులు ఎం ఎస్ . బేగ్ ,రాజు సోలంకి, వివికె. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ట్రాఫిక్ సూచనలపై అవగాహన

**అదోని ఆగస్టు 28 (వార్తప్రభ)** అదోని పట్టణంలోని జ్యోతిర్మయి జూనియర్ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ సీఐ గంటా శ్రీనివాసరావు బుధవారం ట్రాఫిక్ సూచికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 ఏళ్లలోపు వారు బైకులు నడపరాదని, అదేవిధంగా విద్యార్థులు గంజాయి వంటి దురాలవాట్లకు దూరంగా ఉండాలని సూచనలు చేశారు.

# కావలి అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది

**కావలిఆగస్టు 28 (వార్తప్రభ)** అభివృద్ధి పథంలో కావలి నియోజకవర్గం దూసుకుపోతుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. బుధవారం పాతూరులో ఎంపీ నిధులతో ప్రజారోగ్య శాఖ ఆధ్వర్యంలో రూ.9.5 లక్షల వ్యయంతో చేపడుతున్న రెండు సిమెంట్ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామిరెడ్డి వారి వీధిలో రూ.4.5 లక్షలు, కాటా వారి వీధిలో రూ. 5 లక్షల వ్యయంతో శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. కావలి పట్టణ అభివృద్ధి కోసం రూ.10 కోట్లతో డీపీఆర్ తయారు చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపించడం జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఇంటికి నీరు అందించే లక్ష్యంతో రూ. 62 కోట్లతో ప్రారంభించిన అమృత్ పథకం పనులు పూర్తి కానున్నాయని, త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు.

# ఆనాటి జ్ఞాపకాలన్నీ మధురాతి మధురం

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**విజయవాడ పశ్చిమ ఆగస్టు 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోనిటైలర్ మెమోరియల్ హై స్కూల్ 1994–95 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం ఘనంగా జరిగింది. విజయవాడ చిట్టినగర్ ఎస్వీ కన్వెన్షన్ హాల్లో ఈ వేడుకను నిర్వహించారు. 29 ఏళ్ల తర్వాత స్నేహితులు ఒకరినొకరు కలుసుకొని భావోద్వేగానికి గురయ్యారు. అలాగే కొంతమంది విద్యార్థులు తమతో లేకపోవడాన్ని తలుచుకొని బాధను వ్యక్తం చేశారు. గౌరవనీయులైన ఆనాటి ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ఆశీస్సులు తెలిపారు. మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. తమతోపాటే చదువుకున్న డాక్టర్ కొమ్ము జాన్ రాజుమిత్రడు వెంట్రీ లాక్విజం షో చేసి స్నేహితులు అబ్బురాపరిచారు. విద్యార్థులంతా తమ ఆటపాటలతో చిన్నతనాన్ని గుర్తుచేసుకొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. చిన్న చిన్న గేమ్స్ పెట్టుకొని గిఫ్ట్ లు అందజేసుకున్నారు. తామంతా కలిసి దిగిన గ్రూప్ ఫోటోని వెంట వెంటనే ఫ్రేమ్ చేయించుకొని ఆ ఫ్రేమ్ తో ఫంక్షన్ నుంచి బయటకు వెళ్లారు. ఈ కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు మాదాసి వెంకన్న, రేమల్లి కిషోర్ కుమార్, రాచర్ల ప్రకాష్, రేడపొంగు చంద్రశేఖర్, చెవుల మురళి, గాలి విజయ్ కుమార్, పాతర్ల విజయ, పలిశెట్టి సాయి లక్ష్మి నిర్వహించారు.

# జాతీయస్థాయి స్కేటింగ్ క్రీడాకారులను అభినందించిన రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి.

## ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మెడల్ సర్టిఫికెట్ అందజేత




**విజయవాడ : ఆగస్టు 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** హర్యానాలోని గురుగాన్ లో 19వ జాతీయ ఐస్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులులను విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో యువజన క్రీడా శాఖ మంత్రి అభినందించారు. లడక్ లో జరిగిన ఖేలో ఇండియా నేషనల్ గేమ్స్ లో దేవి చంద్ర తేజస్విని భాయ్ సిల్వర్ పతకాన్ని, హరిహ హర్యానాలోని గుర్గాన్ లో జరిగిన 19వ జాతీయ ఐస్కేటింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో షేక్ అఫీన్ తబస్సుం రెండు పతకాలను సాధించారు. ఈ సందర్భంగా మంత్రి ఇరువురిని అభినందించి వారికి మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. మరిన్ని పతకాలు సాధించాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర స్కేటింగ్ కోచ్ అసోసియేషన్ సభ్యులు పలు సమస్యలపై మంత్రి కి వినతి పత్రం అందజేశారు.



# దేవర సాంగ్ లో శనివారం అమ్మాయి.. వ్వాటే క్యూట్



యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న దేవర చిత్రం నుంచి రెండు సాంగ్స్ రిలీజ్ అయిన సంగతి అందరికి తెలిసిందే. ఇందులో జాన్వీ కపూర్, జూనియర్ ఎన్టీఆర్ మీద చిత్రీకరించిన రొమాంటిక్ మెలోడీ సాంగ్ చుట్టమల్లే సూపర్ సక్సెస్ అయ్యింది. ఈ సాంగ్ కి పబ్లిక్ నుంచి అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. సోషల్ మీడియాలో ఈ సాంగ్ విపరీతంగా వైరల్ అవుతోంది. చాలా మంది ఈ సాంగ్ తో షార్ట్ వీడియోస్ చేస్తున్నారు. పాట కూడా యుట్యూబ్ లో ట్రెండింగ్ లో దూసుకుపోతోంది. ఇదిలా ఉంటే ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్ గా నటించిన సరిపోదా శనివారం మూవీ ఆగస్టు 29న థియేటర్స్ లోకి వస్తోంది. నాని హీరోగా తెరకెక్కిన ఈ సినిమా ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. పాన్ ఇండియా రేంజ్ లో రిలీజ్ అవుతోన్న మూవీ కావడంతో అన్ని భాషలలో సినిమాని ప్రమోట్ చేస్తున్నారు. ఈ ప్రమోషన్ యాక్టివిటీస్ లో ప్రియాంకా అరుళ్ మోహన్ కూడా చురుకుగా పాల్గొంటుంది. ఈ ప్రమోషనల్ యాక్టివిటీస్ లో ఇంటరెస్టింగ్ మూమెంట్స్ ని జతచేసి ప్రియాంకా అరుళ్ మోహన్ ఓ వీడియోగా క్రియేట్ చేసి తన ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. ఈ వీడియోకి దేవర సినిమాలోని చుట్టమల్లే సాంగ్ ని ప్రియాంకా జతచేయడం విశేషం. చాలా మంది భార్యాభర్తలు, ప్రేమికులు ఈ సాంగ్ కి డాన్స్ జోడించి యుట్యూబ్ లో షేర్ చేస్తున్నారు. అయితే ప్రియాంకా అరుళ్ మోహన్ మాత్రం వెరైటీగా సరిపోదా శనివారం ప్రమోషన్స్ లో మూమెంట్స్ ని ఈ సాంగ్ కి జత చేసింది. ఇన్ స్టాగ్రామ్ లో ప్రియాంకా అరుళ్ మోహన్ షేర్ చేసిన ఈ వీడియోని ఏకంగా 3.27 లక్షల మంది లైక్ చేయడం విశేషం. ఈ వీడియోలో ప్రియాంకా చాలా అందంగా ఉండటంతో ఆమె అభిమానులు కామెంట్స్ పెడుతున్నారు. దేవర సాంగ్ ని ఈ విధంగా కూడా ఉపయోగించొచ్చా అంటూ కొంతమంది ఆ వీడియోపై ఇంటరెస్టింగ్ గా రియాక్ట్ అవుతున్నారు. ప్రియాంకా అరుళ్ మోహన్ నానితో చేస్తోన్న రెండో సినిమా సరిపోదా శనివారం. ఇది వరకు గ్యాంగ్ లీడర్ సినిమాలో ప్రియాంకా నానికి జోడీగా నటించింది. ఆ మూవీ కమర్షియల్ గా సక్సెస్ కాలేదు. మరల కొంత గ్యాప్ తర్వాత సరిపోదా శనివారంతో ఎంటర్టైన్ చేయడానికి రెడీ అయ్యింది. ఈ చిత్రంలో ఆమె కానిస్టేబుల్ క్యారెక్టర్ లో నటించింది.

# చీరందంలో మత్తెక్కిస్తోన్న నాగినీ అందం!



బాలీవుడ్ అందం మౌనీ రాయ్ అలియాస్ నాగిని ఎలివేషన్స్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఆందాల ఆరోబోతలో అమ్మడు ముందు వరుసలో ఉంటుంది. టూపీస్.. స్విమ్ షూట్ బికీనీల్లో చేసే రచ్చ అంతా ఇంతా కాదు. తెరిచిన పుస్తకం వలే అందాలు ఆరబోస్తుంది. సందర్భం ఏదైనా మౌని ఘాటు ఫోజులకు ఎవరైనా ఫ్లాట్ అవ్వాల్సిందే. అంతగా గ్లామర్ ఎలివేషన్ పై దృష్టి పెడుతుందీ నాగిని. తాజాగా అమ్మడు చీరందంలో కవ్వింపు చర్యలకు దిగిందిలా. ఇదిగో ఇక్కడిలా డార్క్ బ్లూ కలర్ చీరందంలో నడుం అందాల్ని హైలైట్ చేసింది. మ్యాచింగ్ తెలుపు రంగు బ్లౌజు ధరించి చూపరులను ఆకర్షించింది. నేలపై పడుకుని ...పరుపుపై తలకి సపోర్టు గా చేయిని పెట్టి కెమెరాకి వివిధ భంగిమల్లో ఫోజులిచ్చింది. అమ్మడి స్కిన్ టోన్ పాల నురుగుల సౌందర్యమే. సొగసరి మ్యాకప్, అలంకరణ మౌనీని మరింత అందంగా తీర్చిదిద్దాయి. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. మౌని రాయ్ మల్టీట్యాలెంటెడ్. మోడలింగ్ నుంచి అటుపై గాయనిగా..నటిగా ఫేమస్ అయింది. తొలుత సినిమాలకన్నా టీవీషోలతోనే మౌనీరాయ్ బాగా ఫోకస్ అయింది. పాప్ ఆల్బమ్ సింగర్ గానూ మౌనీరాయ్ శ్రోతల్ని అలరించింది. బాలీవుడ్ లో వరుసగా అవకాశాలు అందుకుంటుంది. మునుపటి కంటే మరింత వేగంగా పనిచేస్తోంది. గత ఏడాది ఖాళీగా ఉన్నా 2024 లో మాత్రం నాలుగైదు కమిట్ మెంట్లతో కనిపిస్తుంది. ఆ మధ్య బ్లాకౌట్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇటీవలే రిలీజ్ అయిన జాన్ అబ్రహం వేదలోనూ స్పెషల్ అప్పిరియన్స్ తో అలరించింది. ఆ సినిమా ఫ్లాప్ అయినా మౌనీ రాయ్ పెర్ఫార్మెన్స్ కి మంచి మార్కులు పడ్డాయి.

## వరుణ్ సందేశ్ 'కానిస్టేబుల్' మోషన్ పోస్టర్ రిలీజ్

వరుణ్ సందేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కానిస్టేబుల్' ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ పనులు ముగించుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఈ సినిమాను ఆర్యన్ సుభాన్ డైరెక్ట్ చేస్తుండగా జాగృతి మూవీ మేకర్స్ బ్యానర్‌పై బలగం జగదీష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో వరుణ్ సందేశ్‌కి జోడిగా మధులిక వారణాసి హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తుంది. ఈ సినిమాకి సంబంధించిన మోషన్ పోస్టర్‌ను నిర్మాత కుమార్తె జాగృతి జన్మదినం సందర్భంగా బుధవారం రిలీజ్ చేశారు.

# అశృనయనాలతో బోయి బంగారమ్మ అంతిమయాత్ర

## కన్నీటితో వీడ్కోలు పలికిన పలువురు సిపిఎం, సిఐటియు నాయకులు



**విజయవాడ పశ్చిమ ఆగస్టు 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** 50వ డివిజన్ సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి, సిపిఎం ఫ్లోర్ లీడర్, 50వ డివిజన్, కార్పొరేటర్ బోయి సత్యబాబు మాతృమూర్తి, సిపిఎం పార్టీ సానుభూతిపడురాలు బోయి బంగారమ్మ (68) అంతిమయాత్ర గొల్లపాలెం గట్టు ప్రాంతంలోని కార్పొరేటర్ బోయి సత్యబాబు నివాసం నుంచి బుధవారం అశృనయనాల నడుమ సాగింది. ఈ సందర్భంగా జరిగిన సంతావ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు



సి.హెచ్. బాబూరావు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి.వి. కృష్ణలు పాల్గొని మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బంగారమ్మ సూర్యారావు పేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం పొందుతూ ఈనెల 27వ తేదీ మంగళవారం ఆమె తుది శ్వాశ విడిచారు. బోయి బంగారమ్మ తన భర్త కామ్రేడ్ బోయి సత్యం ప్రేరణతో సి.పి.ఎం పార్టీకి అభిమానిగా మారారు. బోయి సత్యం పార్టీకి చుకైన, క్రమశిక్షణ కల్గిన నాయకుడిగా, రేకు మట్నా వర్కర్స్ యూనియన్ కార్యదర్శిగా తన సేవలను అందించారు. బంగారమ్మ భర్తకు అండగా ఉంటూ, చదువు అంతగా లేకున్నా కుటుంబాన్ని బాధ్యతగా నడిపారని చెప్పారు.. అన్ని కుటుంబాలను పార్టీకి అండగా, సానుభూతిపరులుగా నిలబెట్టటంలో భర్తకు చేదోడు, నాదోడుగా నిలిచారు. ఇప్పటికీ బి కుటుంబాలను పార్టీ కుటుంబాలుగా నిలబెట్టి ఉంచటంలో తన పాత్రను సజీవంగా పోషించినట్లు తెలిపారు. చనిపోయే వరకు ఈ పద్ధతిని ఆమె కొనసాగిస్తూనే అన్ని విధాల ఆదర్శ తల్లిగా బంగారమ్మ నిలిచారని కొనియాడారు. వీరికి ఒక కుమార్తె, నలుగురు కుమారులు కాగా, పెద్ద కుమారుడు బోయి సత్యబాబు పార్టీ పూర్తికాలం కార్యకర్తగా పనిచేయించటంలో ఆమె పాత్ర కీలకమన్నారు. సత్యబాబు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా, 50వ డివిజన్ సిపిఎం పార్టీ కార్పొరేటర్ పనిచేస్తున్నారు.. కుమార్తె లీలా సుందరి లెక్చరర్గాగా పనిచేస్తూ, జనవిజ్ఞాన వేదిక జిల్లా బాధ్యులుగా వున్నారు. మరో కుమారుడు రవి 'ప్రజాశక్తి' దినపత్రిక ఉద్యోగిగా పని చేస్తున్నారని తెలిపారు...డప్పు, కోలాట నృత్యాల నడుమ బోయి బంగారమ్మ అంతిమయాత్ర జరిగింది.డబ్బు, కోలాట నృత్యాల నడుము వేలాదిమంది సిపిఎం, సిఐటియు, ఐద్వా, తెలుగుదేశం, వైఎస్ఆర్ సిపి నాయకులు, 50వ డివిజన్ స్థానిక ప్రజల అశృనయనాల నడుమ గొల్లపాలెం గట్టు ప్రాంతంలోని కార్పొరేటర్ బోయి సత్యబాబు నివాసం నుంచి బంగారమ్మ అంతిమయాత్ర పలు వీధుల గుండా సాగింది. చివరకు ప్రధాన రహదారి కృష్ణవేణి క్లాక్ కాంప్లెక్స్ సమీపం వద్దకు చేరుకుంది. అక్కడ ఎన్ఐర వైద్య కళాశాలకు చెందిన అంబులెన్సుకు బంగారమ్మ భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు అప్పగించారు. ఈ అంతిమ యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, జిల్లా కార్యదర్శి డి.వి. కృష్ణ ఎ,వి, రామరాజు, ఇ.వి. నారాయణ, కె. సూరిబాబు, ఎం. కొండా రెడ్డి, గాదె కొండా రెడ్డి, 50వ డివిజిన్ సిపిఎం నాయకులు పి. రాజు, పి. నాగు, బి, సుల్లేశ్వరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి కె. శ్రీదేవి, ఐద్వా పశ్చిమ సిటీ అధ్యక్ష కార్యదర్శులు కుండనాల శేషమణి, గాదె ఆదిలక్ష్మి, విక్రం లక్ష్మి, తాడేపల్లి సిపిఎం కార్యదర్శి దొంతి వెంకట రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పిళ్ళా రాంబాబు, సాయిబాబు, వైఎస్ఆర్సిపి పశ్చిమ ఇన్చార్జ్ షేక్ ఆసీఫ్, టిడిపి 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) 50వ డివిజన్ నాయకులు కొప్పుల గంగాధర్ రెడ్డి, పలువురు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

**భౌతిక కాయాన్ని ఎస్ఆర్ ఐ మెడికల్ కళాశాలకు కుటుంబ సభ్యులు అప్పగింత...** కార్పొరేటర్ బోయి సత్యబాబు మాతృమూర్తి బోబ బంగారమ్మ భౌతిక కాయాన్ని బుధవారం ఉదయం ఎస్ఆర్ మెడికల్ కళాశాలకు కుటుంబ సభ్యులు అప్పగించారు. బంగారమ్మ భౌతిక కాయం ఎస్ఆర్బ వైద్య విద్యార్థులకు నైపుణ్యత పరీక్షల కోసం తాము తమ తల్లిని ఎన్ఆర మెడికల్ కళాశాలకు అప్పగిస్తున్నట్లు కార్పొరేటర్ బోయి సత్యబాబు ఈ సందర్భంగా తెలిపారు. ఎస్ఆ0 వారి ప్రత్యేక అంబులెన్సులో బోయి బంగారమ్మ భౌతిక కాయాన్ని ఆసుపత్రికి తీసుకువెళ్ళారు





**ఖమ్మం లో రాష్ట్ర యాదవ సంఘ ప్రముఖ నాయకులు కురాకుల నాగభూషణం మనువడి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన యాదవ ప్రముఖులు గొంటి కుమార్ చౌదరి, బిచ్చపతి యాదవ్ తదితరులు**

–వార్తా ప్రభ, ఖమ్మం

# తులసిలో ఒకటి కాదు అనేక రకాలు ఉన్నాయి.. వాటి ప్రత్యేకత ఔషధ గుణాలు ఏమిటంటే



భారతదేశంలోని చాలా ఇళ్లలో తులసి మొక్క కనిపిస్తుంది. ఇది హిందువులకు అత్యంత ప్రాముఖ్యత ఉన్న మొక్క అంతేకాదు ఔషధ గుణాలకు కూడా ప్రసిద్ధి చెందింది. ఇది ఆరోగ్యానికి, చర్మానికి అనేక విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుందని నిరూపించవచ్చు. రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడం, జీర్ణవ్యవస్థను మెరుగుపరచడం, చర్మం, జుట్టు కోసం ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. తులసి సహజ హైడ్రేటింగ్ లక్షణాలను కలిగి ఉంది. ఇది చర్మానికి తేమను అందించడంలో సహాయపడుతుంది. పొడి చర్మం నుంచి ఉపశమనం ఇస్తుంది. ఇది మొటిమలకు సంబంధించిన సమస్యల నుంచి ఉపశమనం కలిగించడంలో కూడా సహాయపడుతుంది. యాంటీ ఆక్సిడెంట్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫ్లూ, యాంటీ బయోటిక్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు తులసిలో ఉన్నాయి. హిందువుల ఇళ్లలో తులసి మొక్కలు పెంచుతున్నారు. అయితే తులసి మొక్కలు చాలా రకాలుగా ఉన్నాయని చాలా కొద్ది మందికి మాత్రమే తెలుసు. చాలా మంది తమ ఇళ్లలో ముదురాకు ఆకుపచ్చ రంగు శ్యామ తులసిని కలిగి ఉంటారు. అంతేకాదు రకరకాల తులసి మొక్కలు ఉన్నాయి. ఈ రోజు రకరకాల తులసి మొక్కల గురించి ఈ రోజు తెలుసుకుందాం ...శ్యామ తులసి మొక్క: శ్యామ తులసి ఆకులు ఊదా రంగులో ఉంటాయి. దీనిని శ్యామ తులసి అంటారు. అంతేకాదు కృష్ణ తులసి అని కూడా అంటారు. మత విశ్వాసాల ప్రకారం ఇది శ్రీకృష్ణుడికి చాలా ప్రియమైనది. కన్నయ్యకి ఇష్టమైన తులసి మొక్క కనుక దీనిని శ్యామ తులసి అని కూడా అంటారు. శ్యామ తులసి ఆకులలో యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ వంటి వివిధ ఔషధ గుణాలు ఉన్నాయి. కనుక ఈ తులసి రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంతో పాటు ఇన్ఫెక్షన్లతో పోరాడడంలో సహాయపడతాయి. రామ తులసి మొక్క: రామతులసి ఆకులు ఆకుపచ్చ రంగులో ఉంటాయి. దీనిని శ్రీ తులసి, లక్కీ తులసి అని కూడా అంటారు. ఈ తులసిని పూజలో ఉపయోగిస్తారు. చాలా ఇళ్లలో రామతులసి కనిపిస్తుంది. దీని ఆకులు రుచిలో తియ్యగా ఉంటాయి. దీనిని ఉజ్వల తులసి అని కూడా అంటారు. విష్ణు తులసి: తెల్ల తులసిని విష్ణుతులసి అని కూడా అంటారు. దానిని గుర్తించడానికి సులభమైన మార్గం తులసి మొక్కకు తెలుపు పువ్వులు పూస్తాయి. ఇది చాలా అరుదుగా ఇళ్లలో పెరుగుతుంది.



# జగ్గయ్యపేట ఎస్సై 2గా బి.ఈ వెంకటేశ్వరరావు

**జగ్గయ్యపేట ఆగస్టు 28 (వార్తప్రభ)** పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సై 2గా బి.ఈ వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు.

# శ్రీసిటీని సందర్శించిన సీజీఎస్టీ కమీషనర్



**శ్రీసిటీ,ఆగస్టు 28 (వార్తప్రభ)** :సీజీఎస్టీ ఆడిట్ కమీషనర్ (ఆంధ్రప్రదేశ్) పి.ఆనంద్ కుమార్ బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, కంపెనీలకు అందిస్తున్న వివిధ సదుపాయాలు, ఇక్కడ చేపడుతున్న సుస్థిరతా చర్యలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలను వివరించారు.శ్రీసిటీ గురించిన వివిధ అంశాలను తెలుసుకునేందుకు ఎంతో ఆసక్తి కనబరిచిన ఆనంద్ కుమార్, శ్రీసిటీ అభివృద్ధి పట్ల యాజమాన్య కృషిని ప్రశంసించారు. బహుళ రంగాలలో పెరుగుతున్న ఎగుమతి కార్యకలాపాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. జీఎస్టీ చెల్లింపులోనూ శ్రీసిటీ పనితీరును కొనియాడారు.ఆనంద్ కుమార్ పర్యటన తమకెంతో ముఖ్యమైనదంటూ డాక్టర్ సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన పరిశీలనలు, సూచనలు శ్రీసిటీ మరింత అభివృద్ధికి అత్యంత విలువైనదిగా ఆయన పేర్కొన్నారు.





# మెగా హీరోల మధ్య దూరం.. ఇది మరో ఉదాహరణ?

రాజకీయాల పరంగా ప్రతి ఒక్కరికి వ్యక్తిగత అభిమానాలు, ఇష్టాలు ఉంటాయి. ఇక ఈ క్రమంలో కొంత గ్యాప్ పెరిగే అవకాశం ఉంటుంది. ఈ పెరిగిన దూరాన్ని తగ్గించే వారికంటే మరింత పెంచే వారే సమాజంలో ఎక్కువగా ఉంటారు. అసలు ఈ సంగతి అంతా ఇప్పుడు ఎందుకంటే మెగా, అల్లు కుటుంబాలను ఫ్యాన్స్ ఎప్పుడు వేరుగా చూడలేదు. పండుగలు, ఫ్యామిలీ సెలబ్రేషన్స్ అన్ని కూడా అందరూ కలిసి చేసుకునేవారు. అయితే ఈ రెండు కుటుంబాల మధ్యలోకి రాజకీయాలు చేరాయి. 2024 ఎన్నికల సమయంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన స్నేహితుడు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి తరుపున ఎన్నికల ప్రచారం చేశారు. అయితే మెగా ఫ్యామిలీ హీరోలైన రామ్ చరణ్, వరుణ్ తేజ్, సాయి ధరమ్ తేజ్ అందరూ పవన్ కళ్యాణ్ తరపున పిఠాపురంలో ప్రచారం చేశారు. చరణ్ పిఠాపురంలో ప్రచారంలో పాల్గొన్న చివరి రోజు అల్లు అర్జున్ నంద్యాలలో వైసీపీ అభ్యర్థి తరపున ఎన్నికల కాంపెయిన్ చేశారు. ఇది మెగా ఫ్యాన్స్ కి, జన సైనికులకు అస్సలు మింగుడుపడలేదు. ఎన్నికల కౌంటింగ్ తర్వాత నాగబాబు ట్విట్టర్ లో చేసిన కామెంట్స్ వైరల్ గా మారాయి. రెండు రోజులకి ట్వీట్ డిలీట్ చేసిన అది అల్లు అర్జున్ గురించే అనే ప్రచారం తెరపైకి వచ్చింది. అప్పటి నుంచి ఈ అల్లు వెర్సస్ మెగా వివాదం ఫ్యాన్స్ మధ్య సోషల్ మీడియాలో నడుస్తోంది. పవన్ కొన్ని రోజుల క్రితం బెంగుళూరులో అధికారులతో మాట్లాడుతూ ఒకప్పుడు అడవిని రక్షించేవారిని హీరోలుగా సినిమాలలో చూపించేవారు. ఇప్పుడు చెట్లు నరికే స్మగ్లర్స్ ని హీరోలుగా చిత్రీకరిస్తున్నారు అని కామెంట్స్ చేశారు. ఇది పుష్పలో అల్లు అర్జున్ క్యారెక్టర్ ని ఉద్దేశించి చేసినవే అనే విమర్శలు వచ్చాయి. ఈ వివాదం నడుస్తూనే ఉంది. అయితే ఇది కేవలం ఫ్యాన్ వార్ కాదని, రెండు కుటుంబాల మధ్య దూరం పెరిగిందనే మాట ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తోంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో పుష్ప ది రూల్ షూటింగ్ తో పాటు వరుణ్ తేజ్ మట్కా, సాయి ధరమ్ తేజ్ కొత్త సినిమాలు షూట్స్ కూడా జరుగుతున్నాయంట. ఈ ముగ్గురి సినిమాల షూటింగ్స్ పక్క పక్కనే జరుగుతున్న కూడా వరుణ్ తేజ్, సాయి తేజ్ అల్లు అర్జున్ ని కలవలేదంట. అలాగే బన్నీ కూడా వరుణ్, తేజ్ లలో ఎవరిని కలిసే ప్రయత్నం చేయలేదంట. సాయి, వరుణ్ కలుసుకున్నా కూడా వారు ఇద్దరు బన్నీని కలవకపోవడంతో ఈ విషయం మరింత హాట్ టాపిక్ గా మారింది. ఒకరికి ఒకరు సంబంధం లేనట్లు షూటింగ్స్ చేసుకుంటున్నారని టాక్ అయితే వైరల్ అవుతోంది. ఈ న్యూస్ ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. అందరూ గొప్పగా చెప్పుకునే మెగా కాంపౌండ్ లో రాజకీయం చిచ్చు పెట్టిందనే మాట ఇప్పుడు వినిపిస్తోంది. మరి ఈ వివాదానికి ఎప్పుడు ముగింపు కార్డు పడుతుందో చూడాలి.

# గృహాలను త్వరితగతిన నిర్మించుకోండి

● లేదంటే హౌసింగ్ స్కీమ్ రద్దయ్యే అవకాశం ఉంది ● రానున్న జూన్ నాటికి మంజూరైన ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి ● కాలనీలలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం ● జిల్లా కలెక్టర్ డా.జి.సృజన





**జి.కొండూరు,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** లేఅవుట్ లో గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని, లేదంటే మంజూరైన హౌసింగ్ స్కీమ్ రద్దయ్యే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన అన్నారు.జి.కొండూరు గ్రామ శివారు 30వ జాతీయ రహదారి సమీపంలో నిర్మాణంలో ఉన్న గృహనిర్మాణ లేఅవుట్ ను బుధవారం జిల్లా కలెక్టర్ జి.సృజన సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.అనంతరం లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహిం చారు. కొంతమంది లబ్ధిదారులు పలు సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకువ చ్చారు.లేఅవుట్ లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. లక్షల రూపాయలు వెచ్చించి లే అవుట్ లో గృహాలు నిర్మించుకున్నామని అయితే సరైన డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు లేకపోవడంతో ఇక్కడ నివాసం ఉండేందుకు ఇబ్బంది పడుతున్నామని తెలిపారు.డ్రైనేజీ లు నిర్మించక పోవడం తో ఇంటి చుట్టూ రోజుల తరబడి నీళ్లు నిలబడి ఉంటున్నాయని, దీంతో దోమలు, పురుగులతో అనేక అవస్థలు పడుతున్నామని కొంతమంది లబ్ధిదారు లు కలెక్టర్ ముందు ఆవేదన వ్యక్తంచేశా రు.మరి కొంతమంది హౌసింగ్ స్కీమ్ ద్వారా గృహాలు నిర్మించుకుంటున్నామ ని,అయితే బిల్లులు రావడం లేదన్నారు. స్థలం ఇచ్చారు కానీ డబ్బులు లేక ఇల్లు కట్టుకోలేక పోతున్నామని ఇల్లు కట్టిస్తే ఇక్కడ ఉంటామని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేదవాని సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై పథకం ద్వారా పక్కా గృహాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. లబ్ధిదారులు మంజూరైన ఇళ్ల నిర్మాణం చేపట్టి రానున్న జూన్ మాసం నాటికీ పూర్తి చేయలేకపోతే నిధులు విడుదల అయ్యే అవకాశం ఉండదని తెలిపారు. గృహాలను నిర్మించుకో వడంలో లబ్ధిదా రులుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు. జి.కొండూరు లేఅవుట్ నందు 360 మంది లబ్దిదారులకు గృహాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. వీటిలో 51 గృహా నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందని 164 బిలోబేస్మెంట్ లెవెల్, 91 బేస్మెంట్ లెవెల్, 2 లింటల్ లెవెల్, 11 రూఫ్ లెవెల్, 34 రూఫ్ కాస్టింగ్ లెవెల్ దశలలో ఉన్నాయన్నా రు.పేదలకు మంజూరు చేసిన గృహాల ను రానున్న జూన్ నాటికి తప్పనిసరిగా పూర్తి చేయవలసి ఉటుందన్నారు. నిర్మాణాలను చేపట్టకుంటే మంజూరైన గృహాలు రద్దవుతాయని భవిషత్తులో కేంద్ర ప్రభుత్వం నుంచి గృహాలు మంజూ రయ్యే అవకా శం ఉండదన్నారు.దీనిని దృష్టిలో పెట్టుకొని ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టేందు కు లబ్ధిదారులు ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు.గృహ నిర్మాణ శాఖ అధికారులు ఎప్పటికప్పు డు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ గృహ నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించా రు.కాలనీలలో రోడ్లను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నా రు.గృహా నిర్మణాలకు సంబంధించి లబ్ధిదారులకు చెల్లింపుల విషయంలో నిధుల కొరత లేదని పూర్తి చేసిన పనులకు ఎప్పటికప్పుడు చెల్లింపులు జరిపేలా చర్యలు తీసుకుం టామన్నారు.కాలనీలలో అవసర మైన మౌలిక వసతులను కల్పించేందుకు నివేదిక సమర్పించాలని జల జీవన్ మిషన్ ఉపాధిహామీ నిధులతో పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సృజన ఆదేశించారు. లేఅవుట్ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట గృహా నిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.రజిని కుమారి,హౌసింగ్ ఇఇ గఫూర్,డీఈ శ్రీనివాసరావు,డీఎస్ఓ మండల ప్రత్యేక అధికారి మోహన్ బాబు,ఎంపిపి వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ,ఎంపీడీవో అనురాధ, గ్రామ సర్పంచ్ మండల అరుణ, డిప్యూటీ తహాశీల్దార్ విజయకుమార్, ఆర్ డబ్ల్యు ఎస్ ఏఈఈ నవీన్ కుమార్, పిఆర్ ఏఈ,మండల వ్యవసాయ అధికారి ఎం. రామ్ కుమార్, వెలుగు పథకం ఏ పి ఎం గురవయ్య, గ్రామ పంచాయితీ కార్యదర్శి ఏటుకూరి బసవలింగేశ్వర రావు, వీఆర్వో లు పాండు, లాజరు, కృపా,మహా కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సెప్టెంబర్ 1న మెగా "రక్తదాన శిబిరం"..

● జనసేన గుడివాడ ఇంఛార్జి బూరగడ్డ శ్రీకాంత్ ఆవిష్కరించిన కరపత్రం..

● పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలలో పాల్గొనున్న ఎంపి వల్లభనేని బాలశౌరీ..




**గుడివాడ,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** బుధవారం ఉదయం జనసేన పార్టీ కార్యాలయం నందు సెప్టెంబర్ రెండో తారీకు జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా జనసేన గుడివాడ నియోజకవర్గ ఇంఛార్జి బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. తొలుత పార్టీ నాయకులతో కలిసి బూరగడ్డ శ్రీకాంత్ సెప్టెంబర్ 1వ తారీకు ఆదివారం ఉదయం 10 గంటలకు వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ నందు జరుగు మెగా బ్లడ్ క్యాంప్ కర పత్రం విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అభిమానులు, కార్యకర్తలు, మెగా అభిమానులు అందరూ రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని కోరుకున్నారు. అలాగే సెప్టెంబర్ రెండో తారీకు స్థానికంగా ఉన్న అన్ని వార్డుల్లోనూ కేక్ కటింగ్ కార్యక్రమం మరియు సేవా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ వేడుకలలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరీ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొంటారు. కావున అన్ని మండలాల్లో గ్రామాలలో కూడా ఈ కార్యక్రమాలు ఉన్నాయని వాటిని అన్నింటిని జయప్రదం చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు మజ్జి శ్రీనివాసరావు, సాయిన రాజేష్, కలపాల చైతన్య, కాకి బాబ్జి, సుంకర వెంకట్, గునుకుల వినోద్, వాసా నవీన్, బుదమ రాజు, వెంకటేష్, భాను, సాయన నాని, పుచ్చకాయల బుజ్జి, నవీన్, వెంకట్రావు వీర మహిళలు గేదెల కళ్యాణి, నల్లి భవాని, దుర్గ, గృహలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

● సిఐటియు కృష్ణాజిల్లా కార్యదర్శి లక్ష్మణరావు..




**గుడివాడ,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడతామని సి.ఐ.టి.యు జిల్లా కార్యదర్శి కె. లక్ష్మణరావు అన్నారు. బుధవారం స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత బషీర్‌బాగ్ కాల్పుల్లో మృతిచెందిన అమరుల చిత్రపటాలకు పూలమాలలతో నివాళ్ళుర్పిం చారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యుత్ బిల్లులకు వ్యతిరేకంగా పోరాడుతూ ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను అపహాస్యం చేసేలా, విద్యుత్తు ప్రైవేటీకరించి, ఆదానికి అప్పచెప్పే పనిలో ఉన్నారనీ విమర్శించారు. ఇందులో భాగంగానే ఆదోని స్మార్ట్ మీటర్లు తయారై రెడీగా ఉన్నాయన్నారు. ఆ మీటర్లు త్వరలో పంపుసెట్లకు, గృహా అవసరాలకు ఏర్పాటు చేయబోతున్నారన్నారు.. ఈ స్మార్ట్ మీటర్ల వలన ప్రజలపై అదనపు భారాలు పడే అవకాశాలు ఉన్నాయనీ, రాబోయే రోజుల్లో విద్యుత్తు ప్రైవేటీకరణకు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలనీ లక్ష్మణరావు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ ప్రధాన కార్యదర్శి పి.రజిని, నాయకులు అరుణ, వీరమ్మ, ఎల్. సురేంద్ర, వెంకటేశ్వరరావు, వర్కర్స్ యూనియన్ నాయకులు ఆర్. కొండ, మొహిద్దీన్ భాషా, రెడ్డి నాగరాజు, అన్నమనేడు వెంకటరమణ, ఎస్.కె. రహమాన్, ఎం నారాయణ, జె. కోటేశ్వరరావు లు పాల్గొనగా, తొలుత అమరవీరుల చిత్రపటానికి సీనియర్ నాయకులు ఏసుపోగు శేషయ్య పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# పట్టాలిచ్చారు... ఋణాలమంజూరు మరిచారు



**విస్సన్నపేట,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో 1000కి పైగా పట్టాలను జగనన్న కాలనీల పేరున కొందరికి గత ప్రభుత్వ హయాంలో అందించడం జరిగింది. పట్టాలిచ్చి సంవత్సరాల తరబడి గృహ నిర్మాణ శాఖ ద్వారా రుణాలు మంజూరు చేయకపోవడంతో నేతి బీరకాయలో నెయ్యి అన్న చందంగా ఇచ్చిన పట్టాలు చూసుకొని మురిచిపోవడానికి తప్ప ఎందుకు పనికి రాలేదని సర్వత్రా అనుకుంటున్నారు. ఏ ఒక్కరికి కూడా గృహ నిర్మాణ శాఖ ద్వారా జగనన్న కాలనీలలో రుణాలు మంజూరు కాకపోవడం రాష్ట్ర చరిత్రలో తిరువూరు నియోజవర్గ గ్రామాలు మాత్రమేనని తెలుస్తోంది. గతంలో జగనన్న కాలనీలలో నీటి సౌకర్యం కొరకు బోర్లు విద్యుత్తు లైన్ లు కొన్నిచోట్ల మాత్రమే ఏర్పాటు చేశారని విసన్నపేట మండల కేంద్రంలో ఎన్నికలు అయిన తర్వాత కౌంటింగ్ కు ముందు విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేసినట్లుగా విశ్వసనీయ సమాచారం అందుతోంది. ప్రస్తుత పరిస్థితులలో జగనన్న కాలనీలో తుమ్మ చెట్లతో నిండిపోయిందని కాలనీ రూపురేఖలు మారిపోయాయని ఇదే కాలనీలో పక్క రాష్ట్ర వాసులకు కూడా ఆనాడు రెవెన్యూ అధికారులు పట్టాలు అందించారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా సొంత ఇంటి కలల సహకారం కొరకు ఎదురు చూసే ఆడపడుచులకు నిరాశ పరిచారని వినిపిస్తు ంది. మంజూరైన గృహాలు నిర్మించకుంటే ప్రస్తుత ప్రభుత్వంలో అందించే రుణాన్ని రద్దు చేస్తామని జూన్ నాటికి మంజూరు అయిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులు ఒకవైపు ఆదేశాలు జారీ చేస్తున్నారని ఇంటి నిర్మాణాలు చేద్దామన్న నియోజకవర్గంలో జగనన్న కాలనీలలో ఆనాటి ప్రభుత్వంలో ఏమాత్రం ముందడుగు పడకపోవడం దురదృష్టకరమని తెలుగింటి ఆడపడుచుల ఆశలని అడియాశలు చేశారని నిరాశ నిస్పృహలతో వారు వాపోతున్నారు.

# జూదరుల అరెస్టు..

## రూ.4,630/-ల నగదు స్వాధీనం



**గుడివాడ,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** పట్టణంలో జూదం ఆడుతున్న నలుగుర్ని మంగళవారం అరెస్టు చేశామని వన్ టౌన్ సి.ఐ. కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఉదయం సి.ఐ. శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ స్థానిక ఏలూరు రోడ్‌లో ఓల్డ్ ఇండెన్ గ్యాస్ స్ట్రీట్ నందు గల ఒక ఇంటిలో జూదం ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. 4, 630/- లు నగదు మరియు పేక ముక్కలు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసి పోలీసు స్టేషన్ కి తరలించడం జరిగిందన్నారు. ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామనీ శ్రీనివాస్ హెచ్చరించారు.

# 29 నుండి భారత ప్రజారోగ్య ఏపీ సామాజిక శాస్త్ర సంఘాల సంయుక్త సమావేశం

● ఎస్వీ మెడికల్ కళాశాల వైద్య ప్రతినిధుల పిలుపు



**తిరుపతి,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక శాస్త్ర మరియు భారత ప్రజా ఆరోగ్య సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 29 , 30 , 31 తేదీలలో జంతువుల నుంచి 75% మానవులకు వ్యాధులు సంక్రమిస్తాయని దీనిపై మూడు రోజులు పాటు జరుగు సదస్సు కు దేశవ్యాప్తంగా 500 మంది డెలిగేట్స్ హాజరుకానున్నారని. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో ప్రజా ఆరోగ్య సదస్సు ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ సునీత సిరిగిరి , జాయింట్ సెక్రెటరీ వీరకిరణ్ , డాక్టర్లు రామాంజనేయులు , యుగేందర్ , మధుసూదన్ రెడ్డి లు తెలియజేశారు. వీరు మాట్లాడుతూ ప్రభుత్వ రుయా హాస్పిటల్ మరియు ఎస్ వి మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో జరుగు ఈ అరుదైన సదస్సుకు అధిక సంఖ్యలో వైద్య బృందాలు హాజరుకానున్నట్లు తెలియజేశారు.

# టీడీపీ మాజీ సర్పంచ్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో కుదరవల్లి -అక్కినేని వారధికి పూర్వవైభవం..



**గుడివాడ,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** అంధకారంలో మగ్గుతున్న కుదరవల్లి అక్కినేని వారధికి పూర్వ వైభవం తెచ్చేందుకు.. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అదేశాల మేరకు ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంగా కుదరవల్లి టీడీపీ పార్టీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మసిముక్కు వేణుగోపాలరావు అక్కినేని వారధి కి వెలుగులు నింపే దిశగ పరిశీలించిన వేణు మాట్లాలాడుతూ.. 2001లో నేను సర్పంచ్‌గా వున్నపుడు వంతెన పనులు శరవేగంగా జరిగి.. 2003 లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగిందన్నారు.. తదనంతరం గోధుమ శైలజ సర్పంచ్ గా ఉన్నపుడు వంతెన కు విద్యుత్ దీపాలు అమర్చడం జరిగిందన్నారు. గత పాలనలో వైసీపీ నాయకులు ప్రభుత్వ వనరులన్ని నిర్వీర్యం చేసారని విమర్శించారు. ఈ క్రమం లో మల్లి పునఃప్రారంభించి మనకున్న వనరులని కాపాడుకుందాం అన్నారు.

# గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి..

● గుడివాడ టూ టౌన్ ఇన్స్పెక్టర్ చిన్ని నాగ ప్రసాద్




**గుడివాడ,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ ఆదేశాల మేరకు గుడివాడ టూ టౌన్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ చిన్ని నాగ ప్రసాద్ సారథ్యంలో స్థానిక చౌదరి పేటలో వున్న కె.టి.ఆర్ ఉమెన్స్ కాలేజీ నందు విద్యార్థులకు గంజాయి మరియు డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి ఇన్స్పెక్టర్ చిన్ని నాగ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు సక్రమమైన నడవడిక కలిగి ఉండాలని.. తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు చెప్పిన మంచి విషయాలు పాటించాలని, ఎటువంటి చెడు నడత కలిగి ఉండకుండా డ్రగ్స్ మరియు గంజాయి మత్తుపదార్థాలు వంటి వాటికి బానిస కాకుండా జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు. గంజాయి మత్తు పదార్థాలు వలన యువత నాశనం కాకుండా ఉండటం కోసం కృష్ణాజిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక టీమ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా గంజాయి రవాణా చేసేవారిని గంజాయి మత్తు పదార్థాలు సేవించే వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా గంజాయి మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఇవ్వవలసిందిగా కోరుతూ.. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. గుడివాడ పట్టణం లోని ప్రతి వార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని వాటి ద్వారా పర్యవేక్షణ మరింత పెంచుతామని తెలియజేశారు. క్షణికావేశాలు లోనై అనవసరమైన కేసుల్లో ఇరుక్కుని జీవితాల్ని నాశనం చేసుకోవద్దని యువతను ఉద్దేశించి మాట్లాడారు. ట్రాఫిక్ నియమాలు, జూశీఎంశీ చట్టం, సైబర్ నేరాలు వంటి వాటి పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా సామాజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, వాట్స్ అప్ ఇన్స్టాగ్రామ్ లాంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని, సోషల్ మీడియా వేధింపులు పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అపరిచితులు, తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, లోన్ యాప్స్, ఇన్వెస్ట్మెంట్లు, ఏపికె ఫైల్, బెట్టింగ్ యాప్స్ లాంటి వాటిలో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని సైబర్ నేరాలకు గురి అయితే వెంటనే 1930 కు ఫోన్ చేసి పిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో సిసిఎస్ ఇన్స్పెక్టర్ ఈ. రమణమ్మ, సబ్ ఇన్స్పెక్టర్ పి. నాగరాజు, కె.టి.ఆర్ ఉమెన్స్ కాలేజీ కాలేజీ ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పురస్కారగ్రహీత 'శ్రీనివాస్'కు ఎస్.టి.యు సత్కారం




**గుడివాడ,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** ఉపాధ్యాయ వృత్తిలో సమున్నతమైన జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికైన ఎం. శ్రీనివాస్‌ను బుధవారం స్థానిక ఎస్.పి.ఎస్. పాఠశాలలో ఎస్.టి.యు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ పురస్కారం పురపాలక ఉపాధ్యాయలకు గర్వకారణ మన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి గుడివాడ పురపాలక సంఘ ఉపాధ్యా యుడు శ్రీనివాస్ ఎంపిక కావటం ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు టి.ఎం.ఈ.రాణి, పి.ఎల్.నరసమాంబ, పి.ఎల్.స్రవంతి, జి.సంధ్య, ఎం.ఉమా మహేశ్వరరావు, ఎస్.టి.యు. జిల్లా, పట్టణ శాఖ సభ్యులు పి.వి. సత్యనారాయణ, పరసా శ్రీ ను, ఐ.అరవింద్, కె.జె.డేనియల్, వై.ప్రసాదరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఉత్తర వీధి ముఖద్వారాన్ని ప్రారంభించిన మంత్రి లోకేష్



**మంగళగిరి,ఆగష్టు 28 (వార్తాప్రభ) :** చట్టాన్ని ఉల్లంఘించి ప్రజలను, కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన అధికారులపై చర్యలు తప్పవని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. మంగళగిరిలో శ్రీలక్ష్మి నరసింహస్వామి వారి ఉత్తర వీధి ముఖద్వారాన్ని మంత్రి ప్రారంభించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య రిబ్బన్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు తడుముకున్న ట్లుగా వైకాపా నేతలు వ్యవహరిస్తున్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టిన వారంతా రెడ్ బుక్ లో ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో అందరికీ మాట్లాడే స్వేచ్ఛ లభించింది. మీడియాకు, ప్రజాప్రతినిధులకు, పులివెందుల ఎమ్మెల్యేకు కూడా స్వేచ్ఛ వచ్చింది. ఇసుక విధానాన్ని ఇంకా మెరుగుపర్చాల్సి అవసరం ఉంది. ముఖ్యమ ంత్రి కూడా ఈ అంశంపై సమీక్షించడం జరిగింది. ఆరోగ్యశ్రీ రద్దుచేస్తా రంటూ వైకాపా దుష్ప్రచారం చేస్తోంది. రద్దు చేస్తే జీవో చూపించాలి. ఆరోగ్యశ్రీతో పాటు కేంద్రం చేపడుతున్న వైద్య కార్యక్రమాలతో అనుసం ధానం చేసి మరింత బలోపేతం చేయటమే మా లక్ష్యం. గత ప్రభుత్వం లో అవలంబించిన విధానాలను సమీక్షించి ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతాం. ఇంగ్లీషు మీడియం రద్దు చేస్తామని ఎక్కడా చెప్పలేదు. మాతృభాషను విస్మరించకూడదనేది మా సంకల్పం. దశలవారీగా ప్రక్షాళన చేస్తాం. వినాయక విగ్రహాల ఏర్పాటుకు గతంలో ఆరుగురు, ఏడుగురి వద్దకు వెళ్లి అనుమతులు తీసుకోవాల్సిన పరిస్థితి. వినాయక పందిళ్లకు అనుమతుల కోసం 2014-19 మధ్య అవలంబించిన సింగిల్ విండో విధానాన్ని పునరుద్ధరిస్తాం.

**మంగళగిరిలో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న వారికి పట్టాలిస్తాం..** మంగళగిరిలో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్ల విస్తరణపై కేంద్ర ప్రభుత్వ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని తదుపరి చర్యలు చేపట్టడం జరుగుతుంది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం విజిబుల్, ఇన్ విజిబుల్ పోలిసింగ్ వ్యవస్థను పటిష్టం చేస్తాం. ఎయిమ్స్ అభివృద్ధి కోసం రోజువారీ అవసరాలకు తగ్గట్లుగా నీటి సరఫరా చేస్తాం. హైడ్రా అంశం తెలంగాణకు సంబంధించినది. మంగళగిరిలో దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న వారికి పట్టాలు అందిస్తామని హామీ ఇచ్చాం. ఆ హామీకి కట్టుబడి ఉన్నాం. రాజధాని అమరావతిలో ఎక్కడన్నా ఆక్రమణలు జరిగితే అధికారులు పరిశీలించి చర్యలు తీసుకుంటారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఇస్తాం.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188